## నేడు 'ప్రజా సమస్యల పరిష్కారం' : కలెక్టర్

రాయచోటి (కలెక్టరేట్), జూన్ 23: ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈనెల 24వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిల్లో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ఆ స్థాయిలో పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రానికి రావాలని తెలిపారు.

గుర్రంకొండకు వస్తున్న ఇసుక ట్రాక్టర్లు



## ఆగని ఇసుక అక్రమ రవాణా

- ట్రాక్టర్ ఇసుక రూ.4 వేలు
- చోద్యం చూస్తున్న అధికారులు

గుర్రంకొండ, జూన్ 23: గుర్రంకొండ పట్టణంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ఇసుక అక్రమ రవాణాపై ప్రభుత్వం ఇప్పటి వరకు ఎటువంటి నిబంధనలు విధించలేదు. ఈ క్రమంలో ఇసుకాసురులు యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతిరోజూ గుర్రంకొండకు పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నారు. ట్రాక్టర్ ఇసుకను వేలాది రూపాయలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని కాశీచెరువు, హరిహరాదులచెరువు, రామానాయునిచెరువు, ఎల్లుట్ల, నడిమిఖండ్రిగ, టి.పసలవాండ్లపల్లె, నరిమడుగు, చెర్లోపల్లె, శెట్టివారిపల్లె, మర్రిపాడు గ్రామాల్లోని చెరువులో ఇసుకాసురులు ఇష్టానుసారంగా ఇసుకను తవ్వేస్తున్నారు. అక్కడ నుంచి ఇసుకను వివిధ ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

### రీచ్ ఇసుక రూ.4 వేలు

గుర్రంకొండ పట్టణంలో రీచ్‌ల నుంచి తెచ్చే ఇసుకను రూ.4 వేలకు విక్రయిస్తున్నారు. గుర్రంకొండ మండలంలో ఇసుక రీచ్‌లు లేవు. దీంతో కలకడ మండలంలోని బాహుదా నది నుంచి ఇసుకను తీసుకొస్తున్నారు. ఈ క్రమంలో పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ప్రతిరోజూ ఇసుకను తోలుతున్నారు. ఈ ఇసుక ట్రాక్టర్లు పట్టణంలో వేలాది రూపాయలకు విక్రయిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాపై రెవెన్యూ, పోలీసులకు రైతులు, గ్రామస్థులు తెలిపినా పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా అక్రమ ఇసుక ట్రాక్టర్లు పోలీస్‌స్టేషన్ ఎదుట నుంచి వెళుతున్నా చోద్యం చూస్తున్నారని ప్రజలు పెదవి విరుస్తున్నారు. అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతున్నారు.

### ఇసుక రవాణాపై చర్యలు తీసుకుంటాం..

గుర్రంకొండ పట్టణంలోకి వచ్చే అక్రమ ఇసుక ట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలించరాదు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే వారిపై చర్యలు తీసుకుంటాము.

- నాగార్జునరెడ్డి, ఎస్‌ఐ, గుర్రంకొండ



టి.పసలవాండ్లపల్లె చెరువులో ఇసుకను లోడ్ చేస్తున్న కూలీలు



అమరావతిలోని సచివాలయంలో రవాణా, క్రీడల శాఖ మంత్రిగా ఆదివారం బాధ్యతలు స్వీకరిస్తున్న మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి.. చిత్రంలో ఆయన కుటుంబ సభ్యులు

ఆ భవనాన్ని చూడగానే ఇంద్రభవనాన్ని తలపిస్తుంది. రాజుల కాలంలో ప్యాలెస్‌ను తలపించేలా పార్టీ కార్యాలయాన్ని నిర్మిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో పార్టీ కార్యాలయాన్ని రాజమహల్‌ను తలపించేలా ఒకే స్ట్రక్చర్‌తో నిర్మిస్తున్నారు. పేదలకు మాత్రం సెంటు స్థలం ఇచ్చిన జగనన్న ఆయన పార్టీ కార్యాలయాన్ని మాత్రం 1.61 ఎకరాల్లో కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి నామమాత్రపు లీజుతో.. ఎలాంటి అనుమతులు లేకుండా భవనాన్ని నిర్మిస్తున్నారు.

నిర్మాణంలో ఉన్న ఇంద్రభవనం లాంటి వైసీపీ కార్యాలయం



# ఇంద్రభవనం

- పేదోడి ఇంటికి ఒక సెంటు స్థలం
- పార్టీ కార్యాలయానికి 1.61 ఎకరాలు
- కారుచౌకగా రూ.12 కోట్ల భూమి..
- ఏడాదికి రూ.1000.. 33 ఏళ్లకు లీజు
- అనుమతులు లేకుండా అక్రమ కట్టడాలు
- కళ్లు మూసుకున్న అధికారులు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీలో పేదోడి ఇంటి కోసం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన భూమి ఒక సెంటు... అదే జగనన్న తన పార్టీ కార్యాలయం కోసం కేటాయించిన భూమి 1.61 ఎకరాలు.. కొండల్లో.. గుట్టల్లో ఉన్న జగనన్న కాలనీలో.. ఇచ్చిన స్థలం విలువ (ప్రభుత్వ లెక్కల ప్రకారం..) రూ.నాలుగు లక్షలు.. జగనన్న పార్టీ కార్యాలయం భూమికి ఏడాదికి అద్దె రూ.1000.. అదీ 33 ఏళ్ల పాటు లీజుకు.. ఆ స్థలం ఖరీదు రూ.12 కోట్లు... దీనిని చూడగానే.. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టిలో పేదలంటే.. ఎవరో? ఎవరికైనా ఇట్టే అర్థం అయిపోతుంది. ఐదేళ్ల జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విలువైన భూములను ఎంత పేదలకు కట్టబెట్టి ఉంటారో? కూడా అర్థం అవుతుంది. రాయచోటి రింగు రోడ్డుకు సమీపంలో అత్యంత విలువైన భూములను కారుచౌకగా కొట్టేయడమే కాకుండా అనుమతులు లేకుండానే నిర్మాణాలు చేపట్టడం మరీ విశేషం. రాజకీయ పార్టీలకు జిల్లా కేంద్రంలో నిర్మించుకోవడానికి భూములు ఇవ్వడం కొత్త కాదు.. అన్ని పార్టీలకు ఇచ్చే అవకాశం ఉంది. అయితే విలువైన భూమిని తక్కువ ధరకు ఇవ్వడం.. అనుమతులు లేకుండానే నిర్మాణాలు చేపట్టడమే ప్రస్తుతం వివాదానికి కారణమవుతోంది.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే.. ప్రతి జిల్లా కేంద్రంలోనూ.. తమ పార్టీ కేంద్ర కార్యాలయాలను నిర్మించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా 2022లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల నిర్మాణాలకు భూములు కేటాయించాల్సిందిగా వైసీపీ శాసనమండలి సభ్యుడు లేళ్ల అప్పిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. ఆయన కోరడమే తరువాయి.. అన్నట్లు.. ఆఘమేఘాల మీద స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల నిర్మాణానికి భూమి కేటాయించాల్సిందిగా ఉత్తర్వులు ఇచ్చింది. ఈ నేపథ్యంలో అన్నమయ్య జిల్లా కేంద్రంలో కూడా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి భూమిని కేటాయిస్తూ 2022 జూన్ 6న అప్పటి కలెక్టర్ గిరీషా పీఎస్ ఉత్తర్వులు ఇచ్చారు.

### రూ.12 కోట్ల విలువైన భూమి..

జిల్లా కేంద్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయ నిర్మాణానికి రాయచోటి మండలం మాసాపేట గ్రామం సర్వే నెంబరు 1022/2లో 1.61 ఎకరాల భూమిని కేటాయించారు. గాలివీడు రింగురోడ్డుకు ఈ స్థలం ఆనుకుని ఉండడం.. చుట్టుపక్కల రియల్ ఎస్టేట్ వెంచర్లు ఉండడంతో ఇక్కడ స్థలాల రేటు భారీగానే ఉన్నాయి. ఎకరా ఎంత లేదన్నా.. ఏడెనిమిది కోట్ల విలువ చేస్తుంది. ఈ లెక్కన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి కేటాయించిన స్థలం విలువ రూ.12 కోట్ల వరకు ఉంటుంది. ఈ స్థలాన్ని 33 సంవత్సరాల పాటు లీజుకు.. ఏడాదికి రూ.1000 అద్దెకు ఇచ్చారు.

### అనుమతులు లేకుండానే.. నిర్మాణాలు

2022లో ప్రభుత్వం ఈ స్థలాన్ని అన్నమయ్య జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి పేరు మీద ఇచ్చారు. సాధారణంగా ఏవైనా నిర్మాణాలు చేపట్టాలంటే.. తప్పనిసరిగా.. అవసరమైన అనుమతులు తీసుకోవాలి. స్థలాన్ని స్వాధీనం చేసుకున్న వాళ్లు అనుమతుల కోసం చేస్తున్న ప్రయత్నాలు ఇంకా స్క్రూటినీ దశలోనే ఉన్నాయి. తాత్కాలిక అనుమతులు కూడా రాలేదు. అయితే ఇవేమీ పట్టించుకోకుండానే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నిర్మాణాన్ని ప్రారంభించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యుడు అయోధ్యరామిరెడ్డికి చెందిన రాంకీ కాంట్రాక్టు కంపెనీ ఈ పనులు చేస్తోంది.

సుమారు రూ.2.50 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టారు. ప్రస్తుతానికి దాదాపు రూ.1.75 కోట్ల మేర పనులు జరిగాయి. ప్రస్తుతం కార్యాలయం నిర్మాణ పనులు సుమారు పూర్తి కావచ్చాయి. బయట నుంచి కార్యాలయం చూడటానికి రాజమహల్‌ను తలపిస్తోంది. 1.61 ఎకరాలలో చుట్టూ ప్రహరీ నిర్మించారు. లోపల సుమారు 300 మంది కూర్చునేలా.. ఒక హాల్, విశాలంగా 8 గదులు ఉన్నాయి. గదుల్లోనూ.. నిర్మాణానికి అత్యంత ఖరీదైన వస్తువులు వినియోగించారు. కిటికీలు, తలుపులు బిగించాల్సి ఉంది. రంగులు వేయాల్సి ఉంది.

### బిల్లుల బకాయి

వైసీపీ కార్యాలయ నిర్మాణానికి కావాల్సిన సిమెంటు, కడ్డీలను స్థానికంగా గాలివీడు రోడ్డులో ఉండే ఓ సిమెంటు దుకాణం నుంచి తెచ్చారు. దుకాణదారునికి ఇంకా రూ.10 లక్షలు ఇవ్వాల్సి ఉంది. ఈ ఏడాది మార్చి నుంచి అదిగో.. ఇదిగో ఇస్తామని తిప్పుకుంటున్నట్లు దుకాణదారుడు వాపోతున్నాడు. అనుమతులు లేకుండా అక్రమంగా చేపడుతున్న నిర్మాణంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



PROCEEDINGS OF THE DISTRICT COLLECTOR :: Y.S.R. DISTRICT
PRESENT: Sri Girisha P.S., I.A.S.

వైసీపీ కార్యాలయానికి భూమిని కేటాయిస్తూ ఇచ్చిన ఉత్తర్వు



కార్యాలయంలోని సభా భవనం





కార్యాలయంలో బిగించడానికి సిద్ధంగా ఉన్న కిటికీలు, తలుపులు

## అతిసార వ్యాధిని అరికట్టాలి : తులసిరెడ్డి

వేంపల్లె, జూన్ 23: అతిసార వ్యాధిని అరికట్టాలని మాజీ రాజ్యసభ సభ్యుడు నర్రెడ్డి తులసిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వేంపల్లెలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు అన్ని జిల్లాల్లో అతిసార వ్యాధి రోజురోజుకు ఎక్కువవుతోందని, ఆసుపత్రులన్నీ అతిసార వ్యాధిగ్రస్తులతో కిటకిటలాడుతున్నాయన్నారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో అతిసార వ్యాధితో నలుగురు చనిపోగా.. 40 మంది చికిత్స పొందుతున్నారని, కాకినాడ జిల్లా సామర్లకోట మండలం జొన్నలదొడ్డిలో ఒకరు మరణించగా... 36 మంది చికిత్స పొందుతున్నారన్నారు. తాగునీటి కాలుష్యమే అతిసారకు కారణమని తెలిపారు. తాగునీటి పైపులు లీకేజీలు కావడం, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం కావడం, పారిశుధ్యాన్ని పట్టించుకోకపోవడమే ప్రధాన కారణాలన్నారు. ప్రభుత్వం సురక్షితమైన తాగునీటి సరఫరాపై శ్రద్ధ వహించాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, సెలైన్ బాటిళ్ల కొరత లేకుండా జాగ్రత్త వహించాలని తులసిరెడ్డి సూచించారు.

## కోదండరామున్ని దర్శించుకున్న ఏర్పేడు పీఠాధిపతి

ఒంటిమిట్ట, జూన్ 23: ఏకశిల నగిరి కోదండరాముడిని ఏర్పేడు పీఠాధిపతి పరిపూర్ణానందస్వామి ఆదివారం కోదండరాముడిని దర్శించుకున్నారు. వీరికి టీటీడీ అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. మూలవిరాట్ అయిన సీతారామ లక్ష్మణులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రంగమండపంలో ఆలయ చరిత్రను తెలుసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో టీటీడీ అర్చకులు వీణా రాఘవాచార్యులు, మాజీ సర్పంచ్ మామిళ్ల శ్రీహరి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



రంగ మండపంలో ఆలయ విశిష్టత తెలుసుకుంటున్న పీఠాధిపతి పరిపూర్ణానంద

## హార్సిలీహిల్స్‌లో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి

బి.కొత్తకోట, జూన్ 23: ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌కు సుప్రీంకోర్టు పూర్వ న్యాయమూర్తి, హర్యానా రాష్ట్ర రెగ్యులేటరీ కమిటీ అండ్ అప్పిలేట్ అథారిటీ జస్టిస్ సురేందర్‌గుప్తా ఆదివారం కుటుంబ సమేతంగా విచ్చేశారు. వీరికి ప్రోటోకాల్ మేరకు తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ పోలీస్, రెవెన్యూ, ట్రాన్స్‌పోర్ట్ అధికారులను ఆదేశించారు. ఆ మేరకు మదనపల్లె ఆర్డీవో హరిప్రసాద్, సీఐ సూర్యనారాయణ, బి.కొత్తకోట తహసీల్దార్ పుణ్యవతి తదితరులు మాజీ న్యాయమూర్తి కుటుంబానికి సాదర స్వాగతం పలికారు. హార్సిలీహిల్స్‌లో ఉన్న పోలీస్ అతిథిగృహంలో వారికి బస ఏర్పాటు చేశారు. వీరు ఈనెల 25వ తేదీ వరకు హార్సిలీహిల్స్‌లోనే ఉంటారని అధికారులు తెలిపారు.

## సీఎం చంద్రబాబుతో జగన్‌మోహన్‌రాజు భేటీ

రాజంపేట, జూన్ 23: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు భేటీ అయ్యారు. ఆదివారం చంద్రబాబును కలిసి నాలుగోసారి ముఖ్యమంత్రి అయిన సందర్భంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. రాజంపేట పార్లమెంట్‌లో ఆరు నియోజకవర్గాల్లో జరిగిన ఎన్నికల అంశంపై చంద్రబాబునాయుడుతో ఆయన చర్చించారు.





# అవినీతి అధికారుల్లో గుబులు..!

- స్థానచలనం లేకుండా ఉండడానికి ముమ్మరంగా పైరవీలు
- అవినీతి అధికారులు సెలవులో వెళ్లడానికి సిద్ధం..
- వైసీపీకి కొమ్ముకాసిన అధికారులపై గురి

రైల్వేకోడూరు, జూన్ 23: వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అవినీతిలో భాగస్వామ్యం అయిన అధికారుల్లో గుబులు పుట్టుకుంది. వైసీపీ ఘోర పరాజయం కావడం.. ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడంతో అవినీతి అధికారులు చాలా మంది సెలవులో వెళ్లడానికి సిద్ధమయ్యారు. స్థాన చలనం లేకుండా ఉండడానికి ముమ్మరంగా పైరవీలు చేస్తున్నారు. ఉమ్మడి కడప జిల్లాలోని రైల్వేకోడూరు ఎస్సీ నియోజకవర్గమైనప్పటికీ రాజకీయంగా ప్రధాన భూమిక ఉంటుంది. ఇక్కడ ఐదేళ్ల కాలంలో వైసీపీ నేతలతో కలిసి అవినీతికి పాలుపంచుకున్న అధికారులను బదిలీ చేయడానికి ప్రభుత్వం నివేదికను రెడీ చేసినట్లు తెలుస్తోంది. అవినీతిలో భాగస్వామ్యం అయిన అధికారులు వైసీపీతో కుమ్మక్కయ్యారు. ప్రధానంగా పోలీసు శాఖ విచ్చలవిడిగా వైసీపీకి దాసోహమైందన్న ఆరోపణలు ఉన్నాయి. ఐదేళ్లలో కానిస్టేబుల్ నుంచి రాజంపేట డీఎస్పీ వరకు వైసీపీతో లాలూచీపడ్డారని తేటతెల్లమైంది. వైసీపీ నేతలు చెప్పిందే వేదంగా పోలీసులు ప్రతిపక్షాలపై దాడులు, కేసులు, దురుసు ప్రవర్తన చేశారు. టీడీపీ, జనసేన పార్టీలపైనే ఎక్కువగా పోలీసులు జులుం ప్రదర్శించారు. మైసూరివారిపల్లెలోని ఏటిపొరంబోకు స్థలంలో కట్టడాలు చేస్తున్నారని జనసేన నాయకులు, ప్రజలు అడ్డుకుంటే వారిపై దాడులు, బెదిరింపులు చేశారు. బ్యానర్లు వేసేందుకు ప్రతిపక్షాలకు తావు లేకుండా చేశారు. బ్యానర్లు వేస్తే చించేసే దారుణమైన స్థితికి వచ్చారు. వీటన్నింటిపై పోలీసు శాఖ చోద్యం చూసిందే తప్ప చర్యలు తీసుకోలేదు. ఆఖరికి జర్నలిస్టులను పోలీసులు బెదిరింపులకు గురి చేశారు. ఎంపీటీసీ, సర్పంచుల ఎన్నికల్లో పోలీసులే రిగ్గింగుకు అవకాశం కల్పించారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రతిపక్షాలు అడ్డుకున్నా ఫలితం లేకపోయింది. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఒక టీడీపీ నేతపై దాడి చేసేందుకు కూడా వెనుకాడలేదు. ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్ల ప్రక్రియలో భాగంగా పోలీసుల సమక్షంలోనే దౌర్జన్యకాండ చేశారు. ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో ఒక కల్యాణ మండపంలో వలంటీర్లతో వైసీపీ నేతలు సమావేశం అయ్యారని తెలిసి వెళ్లిన టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్‌పై దాడులు చేసి కేసులు పెట్టేందుకు వైసీపీ నాయకులు వెనుకాడలేదు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఐదేళ్లలో వైసీపీ వారే పంచాయితీలు చేసి దందాలు చేశారు. పోలీసుల ద్వారా బాధితులకు న్యాయం జరగకపోగా వైసీపీ నాయకులకు న్యాయం చేసే విధంగా పోలీసులు వ్యవహరించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును వైసీపీ ప్రభుత్వంలో అన్యాయంగా కేసులో ఇరికించి జైలుకు పంపిన తర్వాత రైల్వేకోడూరు రాష్ట్ర పార్టీ నిర్ణయం మేరకు ఆందోళనలు శాంతియుతంగా చేస్తుండగా రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడుతో పాటు 13 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు.

ఇరిగేషన్ శాఖలో అవినీతి ఈ ఐదేళ్లలో అవినీతి పెరిగిపోయిందని ప్రతిపక్షాలు ఆందోళన చేసినా ఎవరూ పట్టించుకోలేదు. పుల్లంపేట, చిట్వేలి, పెనగలూరు, ఓబులవారిపల్లె, కోడూరు మండలాల్లో ఇరిగేషన్ శాఖ ద్వారా చేపట్టిన పనుల్లో అవినీతి ఉందని ప్రతిపక్షాలు దుమ్మెత్తిపోశాయి. ఒక అధికారి అవినీతిలో పూర్తిగా భాగస్వామ్యం కావడంతో వైసీపీకి బంగారు బాతుగుడ్డుగా మారింది. మండల పరిషత్ కార్యాలయం అయితే వైసీపీకి ఇష్టారాజ్యంగా మారింది. ఎవరికిపడితే వారికి విచ్చలవిడిగా పనులు కట్టబెట్టారు. కొన్ని చోట్ల పనులు చేయకుండా బిల్లులు చేసినట్లు ఆరోపణలు వినిపించాయి. అధికారం చేతిలో ఉంది కదా అని చాలా వరకు పనుల పందేరం పెట్టారు. కాగా ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో కార్యకర్తలకు పనులు కావాలా డబ్బులు కావాలా అని నేరుగా నేతలే చెప్పడం ఎవరికి ఏది కావాలంటే అది ఇచ్చేశారు. మండల రెవెన్యూ కార్యాలయంలో భూముల ఆన్‌లైన్ విషయంలో వైసీపీ నేతలు దందాలు చేశారు.

కొత్తపల్లె పంచాయతీ పరిధిలో గిరిజనుల భూములు కొందరు ఆక్రమించుకున్నారు. ఈ విషయంలో వామపక్షాలు ఆందోళనలు చేసినా ఫలితం లేకుండా పోయింది. రెవెన్యూ కార్యాలయంలో ఎక్కువగా ఆన్‌లైన్ కోసం డబ్బులు విపరీతంగా తీసుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. వైసీపీ ఆగడాలు రెవెన్యూలో ఎక్కువగా జరిగాయి. వైసీపీ నేత అల్లుడు అని చెప్పుకుని సచివాలయాల్లో చిన్న, చిన్న ఉద్యోగాలు ఇచ్చి దందాలు నిర్వహించారు. పోలీస్‌స్టేషన్‌లో ఆ అల్లుడు దందాలు చేశాడు. పేద ప్రజల్నే కాకుండా ఉన్న వారిని కూడా పీడించుకుని తిన్నారు. ఏ కాంట్రాక్టు పని మొదలైనా సంబంధిత కాంట్రాక్టర్ దగ్గరకు వైసీపీ నాయకులు, కార్యకర్తలు వాలిపోయి డబ్బులు గుంజారు. ఈ విషయాలు నాయకత్వం వహించే వారికి తెలిసినా పట్టించుకోకుండా వారికే వత్తాసు పలికారు. ఆక్రమణల పర్వంలో కూడా అవినీతి అధికారులు భాగస్వామ్యం అయ్యారు. పంచాయతీరాజ్ శాఖలో ఎక్కడా లేని అవినీతి చోటు చేసుకుందని ప్రతిపక్షాలు ఏకమై వాదించినా ఫలితం లేకుండాపోయింది. పనులు చేయకుండానే పనులు పూర్తయినట్లు బిల్లులు చేసుకున్నారని ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఐసీడీఎస్ శాఖలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాల నియామకంలో వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకుల పెత్తనం సాగింది. విద్యాశాఖలో ప్రైవేటు స్కూల్‌లో జరుగుతున్న అక్రమాలపై అధికారులు నోరు మెదపకుండా వైసీపీ నేతలు కట్టడి చేశారు. రోడ్లు భవనాల శాఖలో బ్రిడ్జిలు, రోడ్లు తదితర పనులలో అవినీతి అధికారులతో వైసీపీ నేతలు చెట్టాపట్టాల్ వేసుకుని అందినకాడికి దోచుకున్నారు. చియ్యవరం పంచాయతీలో రోడ్డు పై రోడ్డు వేసుకుని బిల్లులు తీసుకున్న సంఘటనలు ఎన్నో జరిగాయి. మార్కెట్ కమిటీలో వైసీపీ దందాలు చేశారన్న ఆరోపణలు వచ్చినా ఏ అధికారి ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది.

అదేవిధంగా విద్యుత్ శాఖలో వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల విషయంలో వైసీపీ నేతలు దోచుకుని ఖాళీ చేశారని పై అధికారులకు సమాచారం వెళ్లినా ఫలితం లేకుండా పోయింది. అడవుల్లో ఎర్రచందనం కొయ్యలను లేకుండా చేశారు. అడవులలో పుష్కలంగా అరుదైన, విలువైన ఎర్రచందనం ఉంది. దీనిని ప్రతిరోజూ లారీల్లో వైసీపీలో దందాలు చేసే కొందరు నాయకులు తరలించారని టీడీపీ నేతలు ఆరోపించినా ఏ అధికారీ పట్టించుకోలేదనే ఆరోపణలున్నాయి. ఎర్రచందనం దుంగల అక్రమ రవాణాతో వైసీపీ నేతలు కోట్లాది రూపాయలు సంపాదించుకున్నారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా హౌసింగ్ శాఖలో ఎప్పుడూ జరగని అవినీతి జరిగిందని ఆరోపణలు వినిపించినా వైసీపీ అండదండలతో ఆగిపోయిందని ప్రతిపక్ష నాయకులు వాదించారు. నియోజకవర్గంలో జరిగిన అవినీతి, భూదందాలు తదితర వాటి ఫైళ్లను తప్పుదోవ పట్టించకుండా కూటమి ప్రభుత్వం కట్టడి చేస్తోంది. రైల్వేకోడూరు నియోజకవర్గంలో అవినీతికి పాల్పడిన అధికారులు ఇంకా కొత్త ప్రభుత్వంలో కొనసాగాలని పైరవీలు చేస్తున్నారు. కొందరు మాత్రం మనకెందుకులే అన్న భావనతో సెలవుపై వెళ్లాలని నిర్ణయించుకుని పైఅధికారులకు అర్జీలు పెట్టుకున్నారు. కూటమి ప్రభుత్వం మాత్రం అవినీతి అధికారులు చేసిన తప్పులపై కొరడా ఝుళిపించాలని చూస్తున్నారు. అవినీతి మరకలేకుండా ప్రజాసేవ చేసే అధికారులను తెచ్చుకునేందుకు కూటమి ప్రభుత్వం ముమ్మరంగా కసరత్తు చేస్తోంది.

## వైవీయూతో పద్మావతి వర్శిటీ ఎంఓయూ



ఎంఓయూలను మార్చుకుంటున్న వైవీయూ, పద్మావతి వర్శిటీ ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), జూన్ 23: వైవీ యూ, తిరుపతి పద్మావతి విశ్వవిద్యాలయం మధ్య ఎంఓయూ కుదిరింది. వైవీ యూ రిజిస్ట్రారు ప్రొఫెసరు వెంకట సబ్బయ్య, వెవీ వెంకటసుబ్బయ్య, ఐటీ సెల్ డైరెక్టరు ప్రొఫెసరు తుమ్మలకుంట శివ, పద్మావతి వర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసరు భారతి, రిజిస్ట్రార్ రజనీ ఎంఓయూ పత్రాలపై సంతకాలు చేశారు. పద్మావతి వర్శిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసరు భారతి మా ట్లాడుతూ వైవీయూతో అనేక సాంకేతిక పర ప్రయోజనాలు పొందేందుకు ఒప్పందం చేసుకున్నామన్నారు, సీఏఎస్ ప్రమోషన్స్‌కు సంబంధంచిన ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ నుంచి ఆ ప్రక్రియ పూర్తయ్యే వరకు సాంకేతికతను వినియోగించిన తొలి విశ్వవిద్యాలయంగా వైవీయూ ఉండడంతో ఎంఓయూ కుదుర్చుకున్నట్లు ఆమె వెల్లడించారు. వైవీయూ ఐటీ హబ్ సేవలను పొందుకున్నామని తెలిపారు. సీఏఎస్ ప్రక్రియ త్వరితగతిన పూర్తవుతుందని ఆకాంక్షించారు. వైవీయూ రిజిస్ట్రారు ప్రొఫెసరు వెంకట సుబ్బయ్య మాటాడుతూ ఐటీ హబ్ అందించే సేవల ద్వారా ఆర్థిక ప్రయోజనం యూనివర్శిటీకి అందుతుందన్నారు. ఐటీ హబ్ డైరెక్టరు తుమ్మలకుంట శివ మాట్లాడుతూ ఎంఓయూకు మూడేళ్ల కాలపరిమితి ఉంటుదన్నారు.రెండు యూనివర్శిటీల మధ్య సాంకేతికపరమైన సహాయ సహకారాలు అందుతాయన్నారు.

ప్రజాస్వామ్య ప్రభుత్వాలు కాదివి కార్పొరేట్ ప్రభుత్వాలు

## దొంగలు బాబోయ్ దొంగలు....

● తాళం వేసిన ఇళ్లే టార్గెట్

సింహాద్రిపురం, జూన్ 23: రైతుల పొలాల్లో తాళం వేసిన గొడౌన్, ఇళ్లే టార్గెట్‌గా చోరీలు జరుగుతున్నాయి. ఇటీవల సింహాద్రిపురం మండలం బలపనూరు, అగ్రహారం తదితర గ్రామాల్లో తోటల్లో వున్న ఇళ్లలో రాత్రి వేళ దొంగలు చోరీకి యత్నించారు. శనివారం రాత్రి బలపనూరు వాసి హరి అనే రైతు తోటలో వున్న ఇంటి పక్కన షెడ్డుకు తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. హరికి చెందిన బత్తాయి తోట పులివెందుల-సింహాద్రిపురం మెయిన్ రోడ్డు పక్కనే ఉంది. ఇలా రోడ్డు పక్కగల తోటల్లోనే చోరీ జరిగితే, ఇక మారుమూల తోటల్లోని ఇళ్ల పరిస్థితి ఏమిటని రైతుల్లో ఆందోళన మొదలైంది. గతంలో కూడా పలు మార్లు తోటల వద్ద వ్యవసాయానికి సంబంధించిన స్టార్టర్లు, మోటార్లు, కేబుల్ వైర్లు, డ్రిప్పు పరికరాలు, ప్లాస్టిక్ పైపులు రాత్రి వేళ దొంగలు తీసుకెళ్లారు. గతంలో పోలీసుల వద్దకు కూడా రైతులు ఈ విషయం తీసుకెళ్లారు. కానీ ఎలాంటి కేసులు నమోదు కాలేదు. పగలు అంతా పొలాల్లో కష్టపడి పని చేసి అలసిపోయిన రైతులు రాత్రి వేళ కూడా తోటల వద్ద తమ వ్యవసాయ పరికరాల కోసం కావలి కాయాలంటే సాధ్యమయ్యే పని కాదని రైతులు వాపోతున్నారు. కొందరు రైతులు తమ తోటల్లో చోరీ జరిగినా అవమానంగా ఫీల్ అవుతూ బయటకు చెప్పుకోలేకపోతున్నారు. పోయిన వస్తువులు మళ్లీ డబ్బు వెచ్చించి ఆ స్థానంలో కొత్త వస్తువులను సమకూర్చుకుంటున్నారు. పోలీసులు చర్యలు తీసుకుని దొంగతనాలు అరికట్టేలా చూడాలని మండల రైతులు కోరుతున్నారు.

## జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ నూతన కార్యవర్గం ఎన్నిక


జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ నూతన కార్యవర్గం


ప్రొద్దుటూరు టౌన్, జూన్ 23: జిల్లాలో బాల్‌బ్యాడ్మింటన్ అభివృద్ధికి కృషి చేస్తామని జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అధ్యక్షుడు వై.కృష్ణమూర్తి తెలిపారు. ఆదివారం దొరసానిపల్లె జడ్పీ హైస్కూలులో ఉమ్మడి కడప జిల్లా బాలబ్యాడ్మింటన్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం, నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా వై.క్రిష్ణమూర్తి (రాజంపేట), ప్రధాన కార్యదర్శి జి.వెంకటరమణ (ప్రొద్దుటూరు), కోశాధికారి శివనాగిరెడ్డి (కొండాపురం), ఉపాధ్యక్షుడు బాబాఫక్రుద్దీన్, సురేష్‌బాబు, రవీంద్రారెడ్డి, వెంకట మునిరత్నం, నాగముని, జాయింట్ సెక్రటరీలు నందకిశోర్‌కుమార్, ఇమామ్‌బాష, రాజశేఖర్, సుబ్రహ్మణ్యం ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

## ఎన్‌పీఎల్ టోర్నమెంట్ విజేత మంటపంపల్లె


బహుమతి అందుకుంటున్న విజేత మంటపంపల్లె జట్టు

నందలూరు, జూన్ 23: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నందలూరు ప్రీమియర్ లీగ్ 8వ సీజన్ హార్డ్ టెన్నిస్‌బాల్ ఓపెన్-2 క్రికెట్ టోర్నమెంట్ విజేతగా మంటపం పల్లెకు చెందిన ముద్దుకృష్ణ జట్టు నిలిచింది. ఆదివారం ఉదయం బ్యాటింగ్ చేసిన గాంధీనగర్ జట్టు 13 ఓవర్లలో 79 పరుగులకు ఆలౌటైంది. 80 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన మంటపంపల్లె జట్టు 8.2 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 84 పరుగులు చేసి విజేతగా నిలిచింది. ఆ జట్టు బ్యాట్స్‌మెన్ హనుమంతరెడ్డి 63 పరుగులతో నాటౌట్‌గా నిలిచి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ సొంతం చేసుకున్నారు. మొదటి బహుమతి రూ.60,116 చెన్నయ్యగారి పల్లె వాసులు దేవిశెట్టి సుదర్శన్‌రాయల్, దేవిశెట్టి వంశీరాయల్ అందజేయగా, ఆ మొత్తాన్ని మల్లెం విజయ్ మంటపంపల్లె అందజేశారు. దివంగత వల్లి జ్ఞాపకార్థం వారి కుమారులు శీను, చోటులు రూ.40,116 ను రన్నర్స్‌గా నిలిచిన గాంధీనగర్ జట్టుకు అందజేశారు. జనాబ్ ఎస్‌టీ ఖాన్ చారిటుబల్ ట్రస్టు అధ్యక్షుడు, మండల కోఆప్షన్ సభ్యుడు కలీముల్లాఖాన్ దాదాపు 400 మందికి భోజన వసతి కల్పించారు. ఆర్గనైజర్లు గ్రీష్మంత్‌రెడ్డి, ముమ్మడి శెట్టి సుధాకర్, శివకోటి, రంజిత్, పత్తి శంకర, చందు పాల్గొన్నారు.

## ఏడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



పెండ్లిమర్రి, జూన్ 23: మండలంలోని పాపాఘ్ని నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లను ఆదివారం ఎగువపల్లె క్రాస్ వద్ద పట్టుకున్నట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


రోడ్డు ప్రమాదంలో గాయపడిన అనిల్‌కుమార్, గోవర్ధన్

సంబేపల్లె, జూన్ 23: దేవపట్ల శెట్టిపల్లె రోడ్డులో తాటికుంట హరిజన వాడ సమీపంలో జరిగిన ప్రమాదంలో అనిల్‌కుమార్, మదిరాల గోవర్ధన్‌కు గాయాలయ్యాయి. దుద్యాల గ్రామం పెద్దకోడివాండ్లపల్లె వాసి అనిల్ కుమార్, పెద్దజంగంపల్లికి చెందిన గోవర్ధన్ గుండ్రేవాండ్లపల్లె పాల డైరీకి ఆటోలో పాలు తరలిస్తుండగా దేవపట్ల వైపు నుంచి వస్తున్న డీజే వాహనం తాటికుంట హరిజన వాడ వద్ద ఆటో సైడు సౌండ్ బాక్స్ తగలడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. అనిల్‌కుమార్‌కు కాలు విరగ్గా, గోవర్ధన్‌కు చేతికి, మోకాలికి గాయాలయ్యాయి. గోవర్ధన్‌ను చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి, అనిల్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం కడపకు తరలించినట్లు తెలిపారు.

## చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

మదనపల్లె అర్బన్, జూన్23: రోడ్డుప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న విద్యార్థి మృతిచెందినట్లు మదనపల్లె తాలుకా సీఐ శేఖర్ తెలిపారు. మోతీనగర్ వాసి రిజ్వాన్ కుమారుడు అష్రఫ్ ఫార్మసీ కళాశాలలో చదువుతున్నాడు. శుక్రవారం కళాశాల వదలగానే ద్విచక్రవాహనంపై మదనపల్లెకు బయలుదేరాడు. సీటీఎం వద్ద ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీ కొనడంతో అష్రఫ్ గాయపడ్డాడు. వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# శ్మశానం ప్రహరీ తొలగింపు

అడ్డుకున్న స్థానికులు ● పోలీసు స్టేషన్‌కు ట్రాక్టర్ తరలింపు

ఉద్రిక్త వాతావరణం ● పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన సమస్య


శ్మశాన ప్రహరీని తొలగిస్తుండటంతో అడ్డుకున్న గ్రామస్థులు

సీకేదిన్నె, జూన్ 23: ఏడాది దాటినా బిల్లులు ఇవ్వలేదని శ్మశానం ప్రహరీని తొలగించి ట్రాక్టర్‌లో తరలిస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. గ్రామస్థులు అడ్డుకోవడంతో అప్పటి కాంట్రాక్టర్ తమకు డబ్బు ఇవ్వలేదని, మెటీరియల్ తీసుకెళ్లాలని చెప్పడంతో తీసుకెళుతున్నట్లు చెప్పారు. ఇది ప్రభుత్వ ఆస్తి, ప్రజల ఆస్తి, ఇలా తొలగించేందుకు వీలుకాదని గ్రామస్థులు అడ్డుకుని చివరకు పోలీసులకు అప్పగించారు. పోలీసు స్టేషన్‌కు ఏఈని పిలిపించి విచారించగా అందుకు సంబంధించి బిల్లులు గతంలో మంజూరయ్యాయని చెప్పారు. దీంతో పోలీసులు ఆ మెటీరియల్ తెచ్చిన చోటే పెట్టాలని ఆదేశించడంతో వాటిని యథాస్థానంలో పెట్టడంతో కథ సుఖాంతమైంది. వివరాల్లోకెళితే...

చింతకొమ్మదిన్నె మండలం కార్పొరేషన్‌లో విలీనమైన మామిళ్లపల్లె పంచాయతీ 16వ డివిజన్ బలిజపల్లె, సుగాలితండా శ్మశాన వాటికను రక్షించేందుకు గతేడాది సుమారు రూ.2లక్షలతో రెడిమేడ్ పలకలతో ప్రహరీ నిర్మించారు. అయితే అప్పటి నుంచి ప్రీకాస్ట్ మెటీరియల్ తయారు చేసేవారికి బిల్లులు ఇవ్వకపోవడంతో ఆదివారం ఉదయం వారు వచ్చి మెటీరియల్‌ను ట్రాక్టర్‌లో ఎత్తుకుపోతుండడంతో గ్రామస్థులు అడ్డుకుని ప్రహరీ పలకలను తరలించేందుకు వీలులేదన్నారు. దీంతో ఇతర రాష్ట్రాల మెటీరియల్ కాంట్రాక్టర్ వైసీపీ ప్రభుత్వంలో తమకు అడ్వాన్సు మాత్రమే ఇచ్చి మెటీరియల్ తెచ్చుకున్నారని, అప్పటి వైసీపీ కాంట్రాక్టర్ పనులు చేయించుకుని డబ్బు ఇవ్వకపోవడంతో డబ్బు ఇవ్వాలని పలుమార్లు అడిగినా బిల్లులు రాలేదని సమాధానం ఇచ్చేవారని తెలిపారు. శనివారం డబ్బు అడగడంతో ప్రభుత్వం నుంచి డబ్బు రాలేదు, మీ మెటీరియల్ మీరు తీసుకెళ్లండని చెప్పడంతో ఆదివారం మెటీరియల్ తీసుకెళ్లేందుకు వచ్చినట్లు వారు గ్రామస్థులకు తెలిపారు. ట్రాక్టర్‌కు ఎత్తించిన మెటీరియల్, ట్రాక్టర్‌ను గ్రామస్థులు పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు ఏఈని పిలిపించి విచారించగా గతంలోనే ఈ ప్రహరీ బిల్లులు మంజూరు చేశారన్నారు. దీంతో పోలీసులు చొరవ తీసుకుని ఆ మెటీరియల్‌ను కాంట్రాక్టర్‌తో ఎక్కడి వస్తువులు అక్కడే పెట్టాలని సూచించడంతో తిరిగి శ్మశానం వద్ద యథాస్థానంలో పెట్టడంతో ప్రజలు శాంతించారు.

### ఉద్రిక్త వాతావరణం

ఒక్కసారిగా ఉన్నట్టుండి శ్మశానం గోడలు తొలగిస్తున్న విషయాన్ని అటుగా బహిర్భూమికి వెళ్లిన కొందరు గమనించి గ్రామస్థులకు సమాచారం ఇవ్వడంతో గ్రామస్థులంతా వచ్చి వారిని అడ్డుకున్నారు. తమకు బిల్లులు ఇవ్వలేదని, మెటీరియల్ తీసుకెళుతున్నట్లు గ్రామస్థులకు తెలపడంతో కొంత సేపు గ్రామస్థులకు, ఇతర రాష్ట్రాలకు చెందిన మెటీరియల్ ప్రీకాస్ట్ కాంట్రాక్టర్ మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొన్నట్లు గ్రామస్థులు తెలిపారు. అక్కడికి గ్రామస్థులు అధిక సంఖ్యలో రావడంతో వెనక్కు తగ్గిన కాంట్రాక్టర్ అప్పటి వైసీపీ ప్రభుత్వంలో వర్కులు చేయించుకుని బిల్లులు ఇవ్వలేదని, బిల్లు అడిగితే మెటీరియల్ తీసుకెళ్లాలని చెప్పడంతోనే మెటీరియల్ తీసుకెళ్లేందుకు వచ్చినట్లు తెలిపారు. చివరకు పోలీసుల జోక్యంతో గ్రామస్థులు శాంతించారు.

### వైసీపీ మార్కు రాజకీయం

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ శ్మశాన ప్రహరీ నిర్మాణానికి రూ.2 లక్షలకు నిధులు మంజూరై బిల్లులు వచ్చినప్పటికీ ఆ బిల్లులను స్థానిక వైసీపీకి చెందిన ఓ కాంట్రాక్టర్ నొక్కేశారు. పైగా బిల్లులు రాలేదంటూ కాకమ్మ కబుర్లు చెబుతూ మెటీరియల్ కాంట్రాక్టర్లను తన చుట్టూ తిప్పుకుని చివరకు మీ సామాన్లు మీరు తీసుకెళ్లండని చెప్పడం పట్ల గ్రామస్థులు ఆశ్చర్యంతో ఇదేమి చోద్యం అంటూ గుసగుసలాడుకుంటున్నట్లు తెలుస్తోంది. చివరకు మండల వ్యాప్తంగా ఇది హాట్‌టాపిక్‌గా మారినట్లు సమాచారం.

## వైఎస్ఆర్ జిల్లా పేరులో కడపను చేర్చాలి

*● రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిల పక్ష నేతల డిమాండ్*


సమావేశంలో మాట్లాడుతున్న హరిప్రసాద్

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 23: వైఎస్ఆర్ జిల్లా పేరులో కడపను చేర్చాలని అఖిలపక్ష నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరం ఎస్టీయూ కార్యాలయంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంగా కడప ఏర్పడి 200 ఏళ్లయిందన్నారు. 20 ఏళ్ల కిందట దివంగత సీఎం డాక్టర్ వైఎస్ఆర్ ద్విశతాబ్ధి ఉత్సవాల పేరుతో కడప చరిత్ర సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేశారన్నారు. అయితే ఆయన మరణానంతరం కడప పేరును తొలగించి చరిత్ర ఆనవాళ్లే లేకుండా చేసి చారిత్రక తప్పిదం చేశారని ఆరోపించారు. జిల్లా పేరులో తిరిగి కడపను చేర్చి తప్పిదాన్ని సరిదిద్దాలని డిమాండ్ చేశారు. ఒక పరిపాలన కేంద్రంగా కడపకు 200 ఏళ్ల గుర్తింపు ఉన్నా నిజానికి చరిత్రలో కడప అనే పేరు శతాబ్దాల నుంచీ ఉనికిలో ఉందన్నారు. ఇక్కడి ప్రజల విశ్వాసాల ప్రకారం మెకంజీ, కైఫీయత్తుల ప్రకారం కడప అంటే వెంకటేశ్వరుడి గడప, ఖచ్చితమైన చారిత్రకాధారాల ప్రకారం క్రీస్తు శకం 971 నాటికి కడప ప్రాదేశిక విభాగంగా ఉనికిలో ఉన్నట్లు వైదుంబ రాజవంశజులు భువన త్రినేత్ర అనే రాజు అత్తిరాలలో వేయించిన రాగి శాసనం ద్వారా తెలుస్తోందన్నారు. కడప జిల్లా ఒకప్పటి మద్రాసు ప్రెసిడెన్సీలోని రాయలసీమలో అతిపెద్ద ప్రాంతమన్నారు. బళ్లారి సరిహద్దునుంచి ఇప్పటి అనంతపురం, చిత్తూరు, కర్నూలు, ప్రకాశం జిల్లాల్లో చాలా ప్రాంతాలు ఒకప్పుడు కడప జిల్లాలో భాగమే. ఇక్కడ సకల వెనుకబాటు తనాలు, గొప్ప దేశీయ సంప్రదాయాలు కూడా ఉన్నాయన్నారు. నాచన సోమనాథుడు అల్లసాని పెద్దన, సూరన కవి, ఈశ్వరీదేవి సాహిత్య వారసత్వం ఉందని, పండితలోగిళ్ల నుంచి తాళ్లపాక అన్నమయ్య, తేనెపలుకుల పదాల్లో, ప్రజా కవి వేమన, బ్రాహ్మణీయ సంస్కృతిని నిలదీసిన వీరబ్రహ్మం ఈ ప్రాంతీయులేనన్నారు. పోతులూరి వీరబ్రహ్మం కాలజ్ఞానం ఈ నేలలో ఉందని, తెలుగుసినిమా స్వర్ణయుగం నాటికళాకారులు బీఎన్‌రెడ్డి, బి.నాగిరెడ్డి, శాంతకుమారి జిల్లావాసులేనన్నారు. ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ నేత డాక్టర్ తులసిరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, చేతివృత్తుల జాతీయ సమాఖ్య నేత అవ్వారు మల్లికార్జున, ఆప్ నేత డాక్టర్ శ్రీనివాసులు, విరసం వరలక్ష్మి ప్రసంగించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నేతలు ఎన్.వెకటశివారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, బషీరున్నీసా, బాదుల్లా, సావంత్ సుధాకర్, రమణ, మునెయ్య, ఇమ్మనుయేల్, సత్తార్, ఆర్‌సీపీ ప్రసాద్, శివారెడ్డి, విష్ణునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిని కలిసిన ప్రసాద్‌బాబు



రాయచోటిటౌన్, జూన్23: రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు, రాయచోటి టీడీపీ నేత సుగవాసి ప్రసాద్‌బాబు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు చేపట్టి నూతన కార్యాలయంలో అడుగుపెడుతున్న సందర్భంలో మంత్రిని రాష్ట్ర రాజధాని అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## రోడ్డు ప్రమాదంలో ట్రిపుల్‌ఐటీ సెక్యూరిటీ గార్డు మృతి


రాజుప్రసాద్ మృతదేహం

వేంపల్లె, జూన్ 23: ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో సెక్యూరిటీ గార్డు రాజుప్రసాద్ (30) మృతిచెందాడు. ట్రిపుల్‌ఐటీకి బైకులో విధులకు వెళుతూ వేంపల్లె-ట్రిపుల్‌ఐటీలో రోడ్డులోని వైఎస్సార్ ఘాట్ సమీపంలో అదుపుతప్పి కిందపడడంతో మృతిచెందాడు. భార్య గీత ఫిర్యాదు మేరకు ఎస్ఐ రంగారావు, హెడ్‌కానిస్టేబుల్ సుందరం కేసు నమోదుచేశారు. వివరాలిలా ఉన్నాయి. పులివెందుల వాసి రాజుప్రసాద్ ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. ఏడాది కిందట చక్రాయపేట మండ లం కుమార్లకాల్వకు చెందిన గీతతో వివాహమైంది. భార్య, తల్లితో కలిసి వేంపల్లెలో నివాసముంటున్నాడు. ఆదివారం ట్రిపుల్‌ఐటీలో డ్యూటీ నిమిత్తం బైకులో వెళ్తుండగా అదుపుతప్పి పడడంతో తలకు గాయమైంది. ఆస్పత్రికి తీసుకొచ్చేలోపే మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు. డ్యూటీకి వెళ్తూ అనుకోని ప్రమాదంలో మృతిచెందడంతో ఆ కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి. భార్య గర్భవతి కావడం, భర్త చనిపోవడంతో అయ్యోపాపం అంటూ ఆవేదన వెలిబుచ్చారు.

## నిందితుని అరెస్టు

ప్రొద్దుటూరు క్రైం, జూన్ 23: స్థానిక రామేశ్వరం రోడ్డులో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన యువకుడి హత్య కేసులో నిందితుడు వెంకటసుబ్బయ్యను అరెస్టు చేసినట్లు వన్ టౌన్ సీఐ శ్రీకాంత్ తెలిపారు. పూర్తి వివరాల్లోకి వెళితే... దర్గాబజార్ వాసి ఆర్షద్ శుక్రవారం రాత్రి మద్యం తాగి రామేశ్వరం రోడ్డులో కిందపడిపోయాడు. ఈ క్రమంలో అతన్ని బండరాయితో కొట్టి హత్య చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. షేక్ అర్షద్ స్థానిక పుల్లయ్య సత్రం సోమ వెంకట సుబ్బయ్య మధ్య గతంలో గొడవ జరిగింది. అక్రమంలో వెంకటసుబ్బయ్య కుటుంబ సభ్యులను షేక్ అర్షద్ అసభ్య పదజాలంతో తిట్టారు. దీన్ని మనసులో పెట్టుకున్న వెంకటసుబ్బయ్య మద్యం దుకాణం సమీపంలో పడిపోయి వున్న అర్షద్‌ను గమనించి అతని తనపై బండరాయితో కొట్టి చంపినట్లు విచారణలో తెలిసినట్లు సీఐ తెలిపారు. ఈ క్రమంలో వెంకటసుబ్బయ్యను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ తెలియజేశారు.

## దేవగుడిలో ఘర్షణ - ఇద్దరికి గాయాలు

జమ్మలమడుగు, జూన్ 23: దేవగుడి గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం బీజేపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ సందర్భంగా జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలో బాధితుడు సునీల్ విలేకరులతో మాట్లాడుతూ దేవగుడిలో వైసీపీ వర్గీయులు ఎర్రచ్చమ్మగారి చిన్న ఓబయ్య, పెద్ద ఓబయ్య, ఓబులేసు (గుండు)తోపాటు మొత్తం 11 మంది రాళ్లతో దాడి చేశారన్నారు. ఈ ఘటనలో సునీల్, రాజేష్, బీజేపీ వర్గీయులు గాయపడ్డారు. గాయపడినవారు జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి ఆస్పత్రిలో చికిత్స పొంది సాయంత్రం ఆస్పత్రిలో చికిత్స పొందారు. సమాచారం తెలుసుకున్న అర్బన్ పోలీసులు గ్రామాన్ని సందర్శించి విచారణ చేసినట్లు తెలుస్తోంది. బీజేపీ వర్గీయులైన సునీల్‌కు తలకు తీవ్ర గాయం కాగా ఏడు కుట్లు పడినట్లు బాధితుడు తెలిపారు. రాజేష్ అనే వ్యక్తికి కాలికి గాయమైంది. ప్రత్యర్థులకు స్వల్ప గాయాలైనట్లు తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించి జమ్మలమడుగు అర్బన్ సీఐ కరుణాకర్‌ను 'ఆంధ్రజ్యోతి' కేసుకు సంబంధించిన వివరాలను అడుగగా ఆలస్యం అవుతోందని తెలిపారు. బాధితులైతే సాయంత్రం అయిదు గంటలకే పోలీసు స్టేషన్‌లో 11 మందిపై ఫిర్యాదు చేసినట్లు సునీల్ అనే బాధితుడు తెలిపారు.

## మెడిసిన్ విద్యార్థిని మృతి

● యాజమాన్యం నిర్లక్ష్యంతో
మా కుమార్తె మృతి : తల్లిదండ్రులు


సృజని (ఫైల్ ఫొటో)

ఎర్రగుంట్ల, జూన్ 23: కర్ణాటక రాష్ట్రంలోని ఓ కళాశాలలో మెడిసిన్ పీజీ విద్యార్థిని పివీ సృజని(27) అనారోగ్యంతో మృతి చెందింది. కడప జిల్లా ఎర్రగుంట్ల మాజీ జడ్పీటీసీ పి.మాధురి, వెంకటరమణారెడ్డి కుమార్తె సృజని కర్ణాటక మంగుళూరు సమీప సుల్లియాలోని కాలేజిలో చదువుతోంది. నాలుగురోజుల కిందట జ్వరం వచ్చింది. అయితే రక్త పరీక్షలు చేయగా డెంగ్యూ సోకడంతో ప్లేట్‌లెట్స్ తగ్గిపోయాయి. కాలేజిలో సరైన వైద్యం అందకపోవడంతో ప్లేట్‌లెట్స్ బాగా తగ్గి పరిస్థితి విషమించింది. ఆ విషయాన్ని అర్ధరాత్రి దాటిన తర్వాత కాలేజి యాజమాన్యం సృజని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. హైదరాబాదు సనత్‌నగర్‌లో నివాసం ఉంటున్న వారు వెనువెంటనే బయలు దేరారు. అయితే సృజని ఆరోగ్యవిషయంలో కాలేజి వైద్యులు చేతులెత్తేసి మెరుగైన వైద్యం కోసం మంగుళూరుకు వెళ్లాలని చెప్పడంతో ఆమెను మంగుళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో కోమా స్థితికి చేరుకుంది. తల్లిదండ్రులు చేరుకుని కోమాలో కొన ఊపిరితో ఉన్న తమ కుమార్తెను చూసి వారు తల్లడిల్లిపోయారు. చివరి మాటలకు కూడా నోచుకోలేదని విలపించారు. 21వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు మృతిచెందిందని తెల్లిదండ్రులు తెలిపారు. ఈవిషయాన్ని వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కాలేజివద్దకు వెళ్లి విచారణచేయగా కాలేజి యాజమాన్యం ట్రీట్‌మెంట్ విషయంలో సరైన సమాధానం చెప్పలేదని తల్లిదండ్రులు ఆరోపించారు. ఆదివారం తెల్లవారు జామున స్వగ్రామం కడప జిల్లా పోట్లదుర్తికి మృతదేహాన్ని తీసుకొచ్చారు. మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించారు.

### ప్రతిభాశాలిగా గుర్తింపు

సృజని చదువులో మంచి ప్రతిభాశాలి. ఇంటర్ పూర్తయిన తర్వాత మొదటి ప్రయత్నంలోనే ఎంబీబీఎస్ సీటును హైదరాబాదులోని గాంధీమెడికల్ కాలేజిలో సంపాదించింది. అక్కడ ఎంబీబీఎస్ పూర్తిచేసి ఎంఎస్ గైనకాలజిస్ట్ సీటును సుల్లియా కళాశాలలో పొందింది.

### శోకసంద్రంలో తల్లిదండ్రులు, బంధువులు

మాజీ జడ్పీటీసీ పి.మాధురి, వెంకటరమణారెడ్డి కుమార్తె సృజని మరణవార్తను తెలుసుకున్న గ్రామ వాసులు, బంధువులు పెద్దఎత్తున చేరుకుని దుఃఖసాగరంలో ఉన్న తల్లిదండ్రులను ఓదార్చడం ఎవరికీ సాధ్యంకాలేదు. త్వరలో ఎంఎస్ పూర్తిచేసుకుని వస్తుందని కోటి ఆశలతో ఉన్న తల్లిదండ్రులకు సృజని మృతి తీవ్ర దుఃఖాన్ని మిగిల్చింది. ఎంఎస్ చేస్తున్న వైద్య విద్యార్థిని పట్లనే కాలేజివారు ఇంతటి నిర్లక్ష్యం చేస్తే ఇక సామాన్య ప్రజలకు ఎలాగని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబీకులు డిమాండ్ చేస్తున్నారు.

## బీసీల్లో సామాజిక చైతన్యం పెంపొందాలి

దేవాంగ ప్రతిభా పురస్కార సభలో
హైకోర్టు న్యాయవాది పిచ్చుక శ్రీనివాస్



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయవాది శ్రీనివాస్

ప్రొద్దుటూరు జూన్ 23: కేంద్రం, రాష్ట్రంలో కొలువుతీరిన ప్రభుత్వాలు ప్రజాస్వామ్య ప్రభుత్వాలుగా కనపడుతున్నా ఇవి కార్పొరేట్ ప్రభుత్వాలని ప్రముఖహైకోర్టు న్యాయవాది పిచ్చుక శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక దేవాంగ కల్యాణ మండపంలో దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దేవాంగ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందించిన ఆయన మాట్లాడుతూ బీసీలకు విద్యతో పాటు సామాజిక రాజకీయ హక్కుల్లో చైతన్యం పెంపొందించాలన్నారు. నాడు కూడు, గూడు, గుడ్డ వుంటే చాలనే దగ్గరినుంచి నేడు విద్య వైద్యం ప్రధానమయ్యాయన్నారు. కానీ విద్య, వైద్యం ప్రభుత్వ రంగం నుంచి ప్రైవేటు రంగంలోకి వెళ్ళి పోవడంతో అణగారిన వర్గాలకు ఖరీదయ్యాయన్నారు. అందుకే నేడు రాజ్యాంగ హక్కుగా పోరాడాల్సిన అవసరం వుందన్నారు. హ్యాడ్‌లూమ్ టెక్స్‌టైల్స్ రీజనల్ డైరెక్టర్ గుత్తి రాజారావు మాట్లాడుతూ కూటికి లేని స్థితి నుంచి చేనేత బతుకులు నేడు అన్నిరంగాల్లో రాణిస్తున్నారన్నారు. ఏలూరు జిల్లా పంచాయతీ రాజ్ అధికారి విశ్వనాథ్ మాట్లాడుతూ వాట్సప్ ఫేస్‌బుక్ ట్విట్టర్ ఇంటర్నెట్ సోషల్ మీడియాకు ప్రాధాన్యత నిస్తే మన జీవితం నాశనం అవుతుందన్నారు. చదువుకోవడం కష్టమన్నారు. తల్లిదండ్రులు జన్మనిస్తే విద్య జీవితాన్ని ఇస్తుందన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే, అంబేడ్కర్ మనకు ఆదర్శ గురువులన్నారు. టైలర్స్ ఫెడరేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఆకాశపు స్వామి, దేవాంగ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుచ్చల రామక్రిష్ణ, మీడియా సెల్ అధ్యక్షుడు గుత్తి త్యాగరాజు, దేవాంగసంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఉట్టి నాగశయనం మాట్లాడారు. 65 మంది దేవాంగ విద్యార్థులకు ప్రథమ బహుమతిగా ఐదువేలు, ద్వితీయ బహుమతిగా 4 వేలు తృతీయ బహుమతిగా 3 వేలు, 55మందికి కన్సొలేషన్ బహుమతులు అందించారు. సంఘం నేతలు వెంకటసుబ్బయ్య, విశ్రాంత ఎస్ఈ, ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య కల్యాణ మండపం అధ్యక్షుడు రెడ్డిచంద్రశేఖర, సుబ్రమణ్యం, ఉట్టి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రూ.3లక్షల విలువ చేసే కర్ణాటక మద్యం, నాటు సారా ధ్వంసం



పట్టుబడ్డ మద్యంను ధ్వంసం చేయిస్తున్న ఈఎస్ శ్రీనివాసులు

ములకలచెరువు, జూన్ 23: ములకలచెరువు ఎస్‌ఈబీ స్టేషన్ పరిధిలో పట్టుబడిన రూ.3లక్షలు విలువైన కర్ణాటక మద్యం, నాటుసారా ధ్వంసం చేశారు. ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దతిప్పసముద్రం, పెద్దమండ్యం మండలాల్లో జరిపిన దాడుల్లో పట్టుబడ్డ కర్ణాటక మద్యం, నాటు సారాను ఆదివారం ధ్వంసం చేశారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని ఖాళీ స్థలంలో ఎస్‌ఈబీ ఈఎస్ శ్రీనివాసులు సమక్షంలో 233 లీటర్ల కర్ణాటక మద్యం ప్యాకెట్లు ధ్వంసం చేసి 172.5 లీటర్ల నాటు సారాను పారబోశారు. వాటి విలువ రూ.3లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ రామ్మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

## వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె టౌన్, జూన్ 23: వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్యకు యత్నించారు. నిమ్మనపల్లె మండలం చౌకిళ్లవారిపల్లెకు చెందిన నూర్‌అహ్మద్ భార్య షబ్రీన్(25) కుటుంబ కలహాలతో పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబీకులు ఆమెను మదనపల్లె ప్రభుత్వ సర్వజన బోధనాస్పత్రికి తరలించారు. అలాగే తంబళ్లపల్లె మండలం కోటకొండకు చెందిన రెడ్డెప్ప కుమార్తె(16) తల్లిదండ్రులు మందలించాలరని పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. ఆమెను కుటుంబీకులు మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిలో చేర్పించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

## చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

మద నపల్లె అర్బన్, జూన్23: రోడ్డుప్రమాదంలో గాయపడిన విద్యార్థి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు మదనపల్లె తాలుకా సీఐ శేఖర్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లె పట్టణం మోతీనగర్‌కు చెందిన రిజ్వాన్ కుమారుడు అస్రఫ్ సీటీఎం సమీపంలోని ఓ ఫార్మసీ కళాశాలలో చదువుతున్నాడు. శుక్రవారం కళాశాల వదలగానే ద్విచక్రవాహనంపై మదనపల్లెకు బయలుదేరాడు. ఈక్రమంలో సీటీఎం వద్ద ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీ కొట్టడంతో అస్రష్ గాయపడ్డాడు. వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఈ మేరకు తాలుకా సీఐ కేసునమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## పీలేరు పంచాయతీపై విచారణ చేపట్టాలి




సమావేశంలో మాట్లాడుతున్న టీఎల్ వెంకటేశ్

పీలేరు, జూన్ 23: పీలేరు గ్రామ పంచాయతీలో జరుగుతున్న అంతర్గత వ్యవహారాలపై ఉన్నతాధికారులతో సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఐ పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టీఎల్ వెంకటేశ్ ప్రభుత్వాన్ని కోరారు. పీలేరులో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీలేరు పంచాయతీలో అవినీతి జరిగిందంటూ సెలవులో ఉన్న సర్పంచు, ప్రస్తుత ఇన్‌ఛార్జ్ సర్పంచు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నారని తెలిపారు. వారిద్దరి వద్ద ఉన్న ఆధారాలను సేకరించి విచారణ జరిపి అవినీతి జరిగిందో లేదో ప్రజలకు వివరించాలన్నారు. ఒకే పార్టీలో ఉన్న ఇద్దరు నాయకులు పరస్పరం అవినీతి ఆరోపణలు చేసుకోవడంపై పీలేరు పట్టణ ప్రజలు అయోమయంలో ఉన్నారన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు నరసింహులు, శ్రీనివాసులు, మురళీ, తదితరులు పాల్గొన్నారు.

## 26న కోటకొండ గంగమ్మ జాతర



చాందినీ బండ్ల నిర్వాహకులకు విరాళం అందజేస్తున్న మలిగి అనుచరులు

తంబళ్లపల్లి, జూన్23: తంబళ్లపల్లికి సమీపంలోని సంతోపులో వెలసిన కోటకొండ గంగమ్మ జాతరను ఈ నెల 26, 27 తేదీలలో వైభవంగా నిర్వహించు కుందామని టీడీపీ నాయకుడు మలిగి మధుసూదన్‌రెడ్డి అన్నారు. తంబళ్లపల్లి జాతరలో చాందినీబండ్లు కట్టే నిర్వాహకులకు ఆదివారం మలిగి ఆర్థికసాయం అందజేశారు. ఒక్కో చాందినీ బండికి రూ.30వేల చొప్పున మలిగి అను చరులైన కుమార్‌నాయుడు, ఆకులరెడ్డెప్ప, సుబ్రమణ్యం ల చేత నిర్వాహకులకు పంపిణీ చేయించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ తంబళ్లపల్లి జాతరలో ఎటువంటి గొడవలకు పోకుండా ప్రశాంతంగా, ఐకమత్యంలో నిర్వహించుకోవాలని సూచించారు.

## క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్



వాల్మీకిపురంలో సర్టిఫికెట్లు దుస్తులతో క్రీడాకారులు

వాల్మీకిపురం, జూన్ 23: విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడల్లో రాణించడం ద్వారా ఉజ్వల భవిష్యత్ చేకూరుతుందని వాల్మీకిపురం బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాస్కెట్ బాల్ మైదానంలో ఆదివారం బాస్కెట్ బాల్ వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాకారులు, చిన్నారులకు దుస్తులు, సర్టిఫికెట్లు పంపిణీ చేసి అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడూ అందివచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ బాస్కెల్ బాల్ క్రీడలో జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు రవిచంద్ర, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులురెడ్డి, సమ్మర్ క్యాంపు కోచ్‌లు కిరణ్‌కుమార్‌రెడ్డి, అంజిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# వర్షం వస్తే నీరు..వెలిస్తే దుమ్ము

● ఇదీ మదనపల్లె పట్టణంలో రోడ్ల దుస్థితి ● ఇబ్బందుల్లో పట్టణవాసులు, పాదచారులు



ఆర్టీసీ బస్టాండు వెనుక నీటికుంటలా మారిన వర్షపునీరు



సీటీఎం రోడ్డులో రేగిన దుమ్ము

మదనపల్లె టౌన్, జూన్ 23: అన్నమయ్య జిల్లాలోనే అతి పెద్ద మున్సిపాలిటీ..అత్యధిక వార్షిక బడ్జెట్ కలిగిన మదనపల్లె పట్టణంలో రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. మున్సిపల్ పాలక వర్గం, అధికారులు, ఇంజినీర్లు ఉన్నా పట్టణంలో ఒక ప్రణాళిక లేకుండా సిమెంటు రోడ్లు వేయడం, రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన యంత్రాలను ఉపయోగించకపోవడంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వెనక వైపు అంబేడ్కర్ సర్కిల్, ఆటో పార్కింగ్ ప్రాంతంలో ఇరువైపులా సీసీ రోడ్లు ఎత్తుగా వేయడంతో వర్షం వస్తే ఇక్కడ నీరు నిలిచి కుంటలా మారుతోంది. దీంతో పాటు స్థానిక గాంధీరోడ్డులోని ఎంఎల్‌ఎల్ ఆస్పత్రి ఎదుట కూడా డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో వర్షపు నీరు నిలిచిపోతోంది. దీంతో ద్విచక్రవాహనదారులు చాలా ఇబ్బందులు పడుతుండగా, కొందరు జారి కింద పడి గాయాల పాలవుతున్నారు. ఇదిలా ఉండగా వర్షం వచ్చి వెలిశాక రోడ్లపై మట్టి, బురద చేరుతోంది. కాస్త ఎండ వచ్చాక ఈ మట్టి, బురద సన్నని దుమ్ముగా మారి పట్టణంలోని సీటీఎం రోడ్డు నుంచి ఆర్టీసీ బస్టాండు, ఆర్టీసీ బస్టాండు నుంచి వారపు సంత, అవెన్యూరోడ్డు, కదిరిరోడ్డు, బైపాస్ రోడ్డు పొడవునా దుమ్ము పేరుకుపోయి బస్సులు వెళితే దుమ్మంతా తెరలు తెరలుగా లేచి వాహనదారుల కళ్లలో, ముక్కుల్లోకి వెళుతోంది. దీని వలన ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మున్సిపల్ రోడ్లపై దుమ్ము పేరుకుంటే తొలగించేందుకు మున్సిపాలిటి రూ.లక్షలు వెచ్చించి దుమ్ము ఊడ్చే యంత్రం కాస్త మూలనపడింది. ఇకపోతే మున్సిపాలిటిలో కాంట్రాక్టు, పర్మనెంట్ కార్మికులు ఉన్నా వారిని ఉపయోగించి దుమ్మును తొలగించే ప్రయత్నాలు చేపట్టడం లేదు. ఇకనైనా మున్సిపల్ అధికారులు, పాలకవర్గం వర్షం వస్తే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాల్సి ఉంది.



బొంగవారిపల్లిలో మురుగునీటితో నిండిన రోడ్డు

## గ్రామీణ ప్రాంతాల్లో అధ్వాన్నంగా పారిశుధ్యం

నిమ్మనపల్లి, జూన్ 23: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వాన్నంగా తయారైంది. దీంతో నిత్యం ప్రజలకు అవస్థలు తప్పడంలేదు. ఇందుకు నిదర్శనంగా కొండయ్యగారిపల్లి పంచాయతి బొంగవారిపల్లిలో 20ఏళ్ల క్రితం వేసి బండల రోడ్డు దర్శమిస్తుంది. అంతే కాకుండా కాలువలు నిర్మించక పోవడంతో ఇళ్లలోని మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తూ కంపు కొడుతూ దుర్వాసన వెదజల్లుతోంది. అదేవిధంగా కోటకింద మాలపల్లి, పెద్దహరిజనవాడలతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లు వేసి కాలువల నిర్మాణం మరిచారు. స్థానికంగా గ్రామాల్లో పారిశుధ్య పనులు చేస్తున్న అంబుడ్స్‌మేన్‌లకు జీతాలు సక్రమంగా ఇవ్వకపోగా వారిని పట్టించుకోలేదు. అదేవింగా పంచాయతీలకు వచ్చిన సొమ్మును గత వైసీపీ ప్రభుత్వం వేరే ఖాతాలకు మళ్లించడంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు కుంటుపడ్డాయని పలువురు పేర్కొంటున్నారు.

## రాజనీతిజ్ఞుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ



శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యల్లంపల్లె ప్రశాంత్

మదనపల్లె అర్బన్, జూన్23: స్వతంత్ర భారత రాజనీతిజ్ఞుల్లో అగ్రగణ్యుడు బీజేపీ వ్యవస్థాపకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యల్లంపల్లె ప్రశాంత్, పట్టణ అధ్యక్షుడు బర్నే ఎల్లె రవికుమార్‌లు పేర్కొన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి వారు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖర్జీ నినాదాన్ని దేశప్రధాని మోదీ దృష్టిలో ఉంచుకుని ఆర్టికల్ 370ను రద్దు చేశారని తెలిపారు. ముఖర్జీ త్యాగ ఫలితమే బీజేపీ కేంద్రంలో పాలన సాగిస్తోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాజంపేట పార్లమెంట్ జిల్లాప్రధా కార్యదర్శులు ఆకుల కృష్ణమూర్తి, యల్లంపల్లె ప్రశాంత్, నాయకులు పూలాగరాజ, భువనేశ్వర సత్య, కోసూరి భవాని, సంతోష్, బుజ్జి, కొండయ్య, వేణుగోపాల్, పిల్లస్వామినాయక్, తదితరులు పాల్గొన్నారు. కాగా హిందుత్వ వాదాన్ని ప్రగాఢంగా విశ్వసించిన శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి ఆదివారం బీజేపీ నాయకులు రామిరెడ్డిగారిపల్లె రమణారెడ్డి, మదనపల్లె రూరల్ అధ్యక్షుడు వసంతకుమార్, గంధర్వరెడ్డి, కృష్ణప్ప, బొజ్జప్ప, బాలసుబ్రహ్మణ్యం యాదవ్, కిరణ్ ఘనంగా నివాళులర్పించారు.

## పూర్వవిద్యార్థుల అపూర్వ కలయిక



రిటైర్డ్ హెచ్‌ఎం ఓబుల్‌రెడ్డితో పూర్వవిద్యార్థులు

కలకడ, జూన్ 23:పూర్వవిద్యార్థుల అపూర్వ కలయికకు మండలంలోని నడిమిచెర్ల హైస్కూల్ వేదికైంది. 1984-85వ సంవత్సరంలో పదో తరగతి చదివివారు 40 మంది ఒక చోట చేరి యోగక్షేమాలను తెలుసుకున్నారు. విద్యార్థి దశ జరిగిన సంఘటనలు నెమరువేసుకున్నారు. నాడు విద్యాబుద్ధులు నేర్పి ఆదర్శంగా నిలిచిన రిటైర్డ్ హెచ్‌ఎం ఓబుల్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. తమ వంతు సాయంగా పాఠశాలకు సమావేశాలకు ఉపయోగపడే సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం రెడ్డిశేఖర్, ఉపాధ్యాయులు ప్రసాద్‌నాయుడు, పూర్వ విద్యార్థులు గురువరాజు, వెంకటనరసింహులు, చంద్రాచారి, శేఖర్‌బాబు, శ్రీనివాసులు, రమేష్‌బాబులు పాల్గొన్నారు.

## నివాసాల చెంత పాల వ్యర్థాల రోత



వాల్మీకిపురంలోని పాల సేకరణ కేంద్రం సమీపంలో పాల వ్యర్థాల గుంత

వాల్మీకిపురం, జూన్ 23: వాల్మీకిపురం పట్టణంలోని ప్రభుత్వ పాలసేకరణ కేంద్రం కుళ్లు సేకరణ కేంద్రంగా తయారైందని స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపాన నిర్వహిస్తున్న పాల శీతలీకరణ కేంద్రం చుట్టూ దుర్గంధం, పాల వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసనలతో రోత పుట్టిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పాల సేకరణ కేంద్రం నుంచి వచ్చే వ్యర్థాలు పూర్తిగా పేరుకుపోయి సమీప నివాసాలలో ఉండలేకపోతున్నామన్నారు. మురుగు కాస్త తొలగించే చర్యలు తీసుకోకపోవడంతో డెయిరీ సమీపంలో ఓ గుంతలో చేరి భరించలేని దుర్వాసనలు వెదజల్లుతూ ఎక్కడ రోగాల బారిన పడుతామోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొద్ది రోజుల నుంచి డెయిరీ సమీపంలోని ఇళ్లలో ఉండలేకపోతున్నామని, గ్రామ పంచాయతీ అధికారులకు కూడా ఫిర్యాదు చేశామంటున్నారు. అయితే డెయిరీకి వచ్చే పాలు చెడిపోయిన సందర్భంలో అక్కడే పారబోయడం వలన రోత పుట్టించడమే కాక ఆ దుర్గంధం కారణంగా ఎలాంటి రోగాలు వస్తాయోనని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై సంబంధిత మండల మహిళా సమాఖ్య ఏపీఎం నరసింహులును వివరణ కోరగా రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించనున్నట్లు చెప్పారు. డెయిరీ సమీపంలో పారిశుధ్య పనులు కూడా పూర్తిస్థాయి చేపట్టేదిశగా చర్యలు తీసుకుంటామన్నారు.

## కమనీయం.. చెన్నకేశవస్వామి కల్యాణం

మదనపల్లె అర్బన్, జూన్ 23: మండలంలోని పోతబోలు గ్రామం భూమకవారిపల్లె సమీపంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం శనివారం రాత్రి ఆలయకమిటీ సభ్యులతో అత్యంత వైభవంగా కమనీయంగా నిర్వహించారు. ముందుగా ఉత్సవ విగ్రహాలను ముస్తాబు చేసి ప్రత్యేకంగా అలంకరణలు నిర్వహించి శాస్త్రోక్తంగా మంగళవాయిద్యాల నడుమ కల్యాణం జరిపించారు. ప్రతి ఏడాది వార్షికోత్సవం సందర్భంగా ఉత్సవాలు నిర్వహించడం ఆనవయితీ. ఇందులో భాగంగా ఉదయాన్నే స్వామివారికి విశేషపూజలు నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని పోతబోలు గ్రామస్థులే కాకుండా మదనపల్లె, సీటీఎం పరిసరప్రాంత ప్రజలు కన్నుల విందుగా తిలకించారు. భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు అన్నదానం వితరణ చేశారు. ఆదివారం ఉదయం వివాహం జరిపిన విగ్రహాలను ప్రత్యేక వాహనంతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయకమిటీ సభ్యులు, పోతబోలు గ్రామస్థులు పర్యవేక్షించారు.

## కెంపేగౌడ వారసత్వాన్ని కాపాడుకుంటాం

● జయంతి వేడుకలలో మొరుసుకాపు నేతలు

● బి.కొత్తకోటలో ఘనంగా వేడుకలు



బి.కొత్తకోటలో కెంపేగౌడ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మొరుసుకాపు నాయకులు

బి.కొత్తకోట, జూన్23: మొరుసుకాపు(వక్కలిగ)లకు ఆద్యుడు, కర్ణాటక రాష్ట్రంలో వక్కలిగర కులస్థులు ఆరాధ్యుడుగా కొలిచే బెంగళూరు మహానగర నిర్మాణానికి బీజం వేసిన కెంపేగౌడ 515వ జయంతిని ఆదివారం బి.కొత్తకోట పట్టణం లోని జ్యోతిసర్కిల్ లో ఘనంగా నిర్వహించారు. మొరుసుకాపు సేవాసంఘం ఆధ్వర్యంలో కెంపేగౌడ చిత్రపటానికి పూలమాలలు వేసి, కొబ్బరికాయలు కొట్టి నివాళులర్పించారు. భారీకేక్ కట్‌చేసి పరస్పరం తినిపించుకుని శుభాకాంక్షలు చెప్పకున్నారు. అన్నసంతర్పణ గావించారు. ఈ సందర్భంగా మొరుసుకాపు నేతలు ఎంఎస్ చంద్రశేఖర్‌రెడ్డి, రాయలసీమ రమేష్, లోకనాథరెడ్డిలు మాట్లాడుతూ తంబళ్లపల్లె, మదనపల్లె ప్రాంతంలో అధికంగా ఉన్న మొరుసుకాపులను బీసీ-బి జాబితాలో చేరుస్తూ 2018లో చంద్రబాబు ప్రభుత్వం జీవోనంబర్ 33 జారీచేశారని, వైసీపీ అధికారంలోకి రాగానే ఆ జీవోను తుంగలో తొక్కారని విమర్శించారు. రాష్ట్రంలో మళ్లీ చంద్రబాబు సీఎం అయినందున బీసీ రిజర్వేషన్ అమలుకు కలిసికట్టుగా ప్రయత్నిస్తామన్నారు. కెంపేగౌడ అమర్‌రహే, మొరుసుకాపుల ఐక్యత వర్ధిల్లాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు మార్కిరి అంజనేయరెడ్డి, నారాయణస్వామిరెడ్డి, బూర్లపల్లె మాధవరెడ్డి, సుధాకర్‌రెడ్డి, చిటికిశివారెడ్డి, ప్యాయలమునిరెడ్డి, కాసిపల్లిసుబ్బారెడ్డి, గొందిపల్లిబాస్కర్‌రెడ్డి, పీయస్ మధు, మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.

## రెడ్డెమ్మకు ప్రత్యేక పూజలు



అలంకరణలో అమ్మవారు

గుర్రంకొండ, జూన్ 23:గుర్రంకొండ మండలం చెర్లోపల్లెలో కొలువైన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయంలో అమ్మవారు సంతానలక్ష్మీగా ప్రసిద్ధి చెందారు. అమ్మవారిని పరిమళ భరిత పుష్పాలతో అలంకరించి పూజలను నిర్వహించారు. అమ్మవారిని దర్శిం చుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కు లు తీర్చుకోవడానికి ఆలయానికి రావడంతో పరిసరాలు భక్తులతో రద్దీగా మారాయి. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

## ఘనంగా పోలేరమ్మ జాతర

గుర్రంకొండ, జూన్ 23:మండలంలోని నడిమిఖండ్రిగ గ్రామంలో కొలు వైన పోలేరమ్మ జాతరను గ్రామస్థులు వైభవంగా నిర్వహించారు. గ్రా మంలోని మహిళలు అమ్మవారి దీలు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల పూలతో అలంకరించి ప్రత్యేక పూజలను చేశారు. భక్తులు అమ్మవారికి మొక్కుగా చాందినీ బండ్లు కట్టి బాణసంచుల పేల్చుతూ ఆలయం చుట్టూ తిప్పా రు.

## వైభవంగా శివపార్వతుల రథోత్సవం

పుల్లంపేట, జూన్ 23 : స్థానిక పర్వతవర్ధినిదేవి శాంతిలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శివపార్వతుల రథోత్సవం నిర్వహించారు. రథోత్సవం వెంట విచిత్ర వేషధారణ ఎంతగానో ఆకట్టుకున్నాయి. మహిళలు కన్నులపండుగగా కోలాటం వేశారు. బాణసంచా పేలుస్తూ పుల్లంపేట వీధుల్లో రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయంలో రెండు వేల మందికి అన్నసంతర్పణ చేశారు.

## డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను కలసిన ఎమ్మెల్యే



డిప్యూటీ సీఎం పవన్‌తో ఎమ్మెల్యే , జనసేన నేతలు రామాంజనేయులు, అనిత

మదనపల్లె, జూన్ 23: పిఠాపురం ఎమ్మెల్యే, జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా, జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు, పార్టీ రాష్ట్రకమిటీ సభ్యురాలు అనితలు కలిశారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో డిప్యూటీ సీఎంను మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల హామీ మేరకు మదనపల్లెను జిల్లా కేంద్రం చేయాలని, చిప్పిలి, గుట్టకిందపల్లె సమ్మర్‌స్టోరేజీ ట్యాంకుల మొరవలు పూర్తి చేయాలని వారు కోరారు. అలాగే నిరుద్యోగులు, కార్మికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు పరిశ్రమలు ఏర్పాటుకు చేయాలని ఎమ్మెల్యేతోపాటు శ్రీరామ రామాంజనేయులు, దారం అనితలు అధినేతను కోరారు. మరోవైపు మదనపల్లె పర్యటనకు రావాలని పవన్‌కళ్యాణ్‌ను ఆహ్వానించారు.

## మంత్రులను కలసిన తంబళ్లపల్లె టీడీపీ నేత చంద్ర



మంత్రి అచ్చెన్నాయుడుకు సైకిల్ జ్ఞాపికను అందచేస్తున్న నాయకులు



మంత్రి కొల్లు రవీంద్రకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

తంబళ్లపల్లె, జూన్ 23: రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఎక్సైజ్, గనుల శాఖా మంత్రి కొల్లు రవీంద్రను రాజంపేట తెలుగుయువత ఉపాధ్యక్షుడు దేరంగుల చంద్ర మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం రాత్రి అమరావతిలోని వారి క్యాంపు కార్యాలయాల్లో జాతీయ బీసీ చైతన్య సమితి వ్యవస్థాపకుడు రమణ, జాతీయ కార్యదర్శి ఏడుకొండలతో మంత్రులను కలసి పుష్పగుచ్ఛం అందచేసి దుశ్శాలువలతో సన్మానించారు. ఈ సందర్భంగా చంద్ర.. మంత్రులకు టీడీపీ గుర్తు సైకిల్ జ్ఞాపిక, తిరుమల శ్రీవారి ప్రసాదం అందచేశారు. ఈ సందర్భంగా మంత్రులు తంబళ్లపల్లెలో టీడీపీ ఓటమి చెందడానికి గల కారణాలను అడిగినట్లు చంద్ర తెలిపారు. తంబళ్లపల్లెలో టీడీపీని బలోపేతం చేయడానికి కృషి చేయాలని సూచించినట్లు తెలిపారు.

## మంత్రి మండిపల్లికి మదనపల్లె నేత శుభాకాంక్షలు



మంత్రి మండిపల్లికి శుభాకాంక్షలు తెలుపుతున్న శ్రీరామ్‌చినబాబు

మదనపల్లె టౌన్, జూన్ 23: రాష్ట్ర రవాణా, క్రీడా, యువజనశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదివారం రాష్ట్ర సచివాలయంలో మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మదనపల్లెకు చెందిన టీడీపీ నాయకులు మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు మంత్రిని కలసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే అన్నమయ్య జిల్లా టీడీపీ బీసీ విభాగం అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్ మంత్రి మండిపల్లి, మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలసి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నేతలు లక్ష్మిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, దొరస్వామినాయుడు పాల్గొన్నారు.



మంత్రి రాంప్రసాద్‌రెడ్డినిని కలిసిన తంబళ్లపల్లె టీడీపీ నేతలు



మంత్రి నారా లోకేశ్‌ని కలిసిన సురేంద్రయాదవ్

**కురబలకోటలో:** తంబళ్ళపల్లె నియోజకవర్గానికి చెందిన పలువురు టీడీపీ నేతలు మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని విజయవాడలో కలిశారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరుణంలో నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేతలు వెళ్లి ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, దుశ్శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పలు విషయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో నియోజకవర్గపరిశీలకుడు మల్లికార్జున నాయుడు, మదనపల్లె విజయభారతి విద్యాసంస్థ అధినేత సేతు, మండల కన్వీనర్ వైజీ సురేంద్ర, విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గానికి చెందిన పలువురు టీడీపీ బీసీ నేతలు మంత్రులు నారా లోకేశ్, రాంప్రసాద్‌రెడ్డి, కొల్లు రవీంద్రల ను విజయవాడలో కలిశారు. మంత్రులుగా బాధ్యతలు చేపట్టిన తరుణంలో నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. అనంతరం మంత్రులను టీడీపీ రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్ కలిసి దుశ్శాలువతో సన్మా నించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ నియోజక వర్గంలో పర్యటించాలని కోరగా, త్వరలోనే పర్యటిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాగరాజయాదవ్, మనోహర్‌నాయుడు, చిన్నరెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన నాగరాజా

పెద్దమండ్యం, జూన్ 23: గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు గుడి నాగరాజా ప్రభుత్వాన్ని కోరారు. అమరావతి లోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆయన రాష్ట్ర ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి దుశ్శావలువలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ వార్డు సమస్యలను పరిష్కరించాలని కోరారు. సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్ ప్రొమోషన్ ఛానల్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణ పాల్గొన్నారు.

## టీడీపీ నాయకులు సమన్వయంతో పనిచేయాలి



విజయ్‌కుమార్‌గౌడును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

రామసముద్రం, జూన్ 23: మండల, నియోజకవర్గ, పార్లమెంట్ స్థాయిలోని టీడీపీ నాయకులు అందరూ సమన్వయంతో పనిచేయాలని పార్లమెంట్ టీడీపీ నాయకుడు సుబ్రహ్మణ్యంరాజు పేర్కొన్నారు. రామసముద్రంలోని టీడీపీ నాయకులు అశోక్, శ్రీనాథ్‌లను ఆదివారం సుబ్రహ్మణ్యంరాజు కలిసి భవిష్యత్తులో పార్టీ అభివృద్ధికి తీసుకోవలసిన జాగ్రత్తలు, పార్టీలో ప్రాముఖ్యం గూరించి సభ్యులకు వివరించారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడును మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. ఈకార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, యూనిట్ ఇన్‌ఛార్జి సుధాకర్, పంచాయతీ అధ్యక్షుడు ఆనంద్, సోమశేఖర్, ఒంటెల అల్తాఫ్, రమేష్ రెడ్డి, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన మహాభారతయజ్ఞం



మహాభారతయజ్ఞంలో హరికథ కాలక్షేపం వింటున్న భక్తులు

మదనపల్లె అర్బన్, జూన్ 23: స్థానిక టిప్పుసుల్తాన్ మైదానంలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం భాగవతారణి జోత్స్న చెప్పిన హరికథ భక్తులను అలరించింది. ఆదివారం శ్రీకృష్ణుడి జనన వృత్తాంతం హరికథ రూపంలో భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా భారత యజ్ఞం కమిటీ సభ్యుడు డాక్టర్ రామచంద్ర, బీజేపీ వెంక టేష్‌లు మాట్లాడుతూ గత 18 ఏళ్లుగా నీరుగట్టువారిపల్లెలో మహాభారతం నిర్వహిస్తున్న ట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది కూడా 18 రోజులుపాటు మహాభారతం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## నేటి నుంచి పీలేరులో ఉరుసు

పీలేరు, జూన్ 23: పీలేరు నెహ్రూబజారులోని హజరత్ మహబూబ్ సుబహాని మీనారు వద్ద సోమవారం నుంచి మూడు రోజులపాటు ఉరుసు జరగనుంది. ఈ మేరకు ఉరుసు కమిటీ నిర్వాహకులు ఆదివారం నుంచి ఏర్పాట్లు ముమ్మరం చేశారు. సోమవారం రాత్రి ఫకీర్ల విన్యాసాల నడుమ గంధం ఊరేగింపు ఉంటుందని వారు తెలిపారు. మంగళ, బుధవారం రాత్రిళ్లు ఖవ్వాలీ ప్రదర్శన ఉంటుందని, ఉరుసు మహోత్సంలో పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

న్యాయమూర్తులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచన




న్యాయమూర్తుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి భీమరావు

చిత్తూరు లీగల్, జూన్ 23: రానున్న కొత్తచట్టాలపై న్యాయమూర్తులు అవగాహన పెంచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమరావు సూచించారు. చిత్తూరులోని జడ్పీ సమావేశ మందిరంలో ఆదివారం జిల్లాలోని న్యాయమూర్తులకు కొత్త చట్టాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత న్యాయశాఖ కొత్త చట్టాలను తీసుకుని రావడంతో పాటు కొన్ని చట్టాలకు పేర్లు మారుస్తూ శిక్ష, జరిమానాలు పెంచిందన్నారు. 2023 ఇది పూర్వం ఇండియన్ సివిల్ కోర్టు 1860గా ఉండేదని, న్యూక్రిమినల్ లా భారతీయ న్యాయ సంహిత- 2023, భారతీయ నాగరిక సురక్ష సంహిత- 2023, భారతీయ సాక్ష్య అదిహీనియం -2023 కొత్త చట్టాలను తీసుకురావడం జరిగిందన్నారు. ఈ చట్టాలు జూలై ఒకటో తేది నుంచి అమల్లోకి వస్తాయన్నారు. ప్రాసిక్యూషన్, బెయిల్, వాయిదాలు, పరిహారం సంబంధించిన సంస్కరణలపై రీసోర్స్ పర్సన్స్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా న్యాయాధికారులకు వివరించడం జరుగుతుందన్నారు. అనంతరం జిల్లా న్యాయమూర్తిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు రమేష్, శాంతి, వెన్నెల, మాధవి, శ్రీనివాసులు, ధర్మారావు, శ్రీదేవి, ఉమాదేవి, బాబాజాన్, కీర్తన, శిరీష, వాణిశ్రీ, విజయసారధి రాజు, గురు అరవింద్, రాఘవేంద్రతో పాటు పలువురు న్యాయమూర్తులు, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



హాజరైన న్యాయమూర్తులు, న్యాయశాఖ సిబ్బంది

## ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

● 1.120 కిలోల గంజాయి స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), జూన్ 23: తిరుపతిలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని వెస్ట్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 1.120 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వెస్ట్ సీఐ జయనాయక్ కథనం మేరకు...ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశాల మేరకు డీఎస్పీ రవిమనోహరాచ్చారి పర్యవేక్షణలో పుంగనూరు మండలం మిట్టపెద్ద తాండాలో కాపురమున్న బి.చంద్రశేఖరనాయక్, మదనపల్లెకు చెందిన వృద్ధురాలు ఆప ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సైకిల్‌పై విక్రయించడానికి తీసుకెళుతున్నారు. ఆ సమయంలో సీఐ జయనాయక్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. అనుమానంతో వారిని పిలిచి తనిఖీ చేయగా.. గంజాయి ప్యాకెట్లు కనిపించాయి. దీంతో వారిద్దరిని అదుపులోకి తీసుకుని గంజాయి సీజ్ చేసారు. విచారించి వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు.

## అక్రమ నిర్మాణాన్ని కూల్చడం తప్పా...? : టీడీపీ



మాట్లాడుతున్న దొరబాబు, సురేంద్రకుమార్

చిత్తూరు సిటీ, జూన్ 23: అక్రమంగా నిర్మించిన వైసీపీ భవనాన్ని కూల్చడం తప్పా అని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ ప్రశ్నించారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో వారు మాట్లాడుతూ తాడేపల్లెలో నిర్మిస్తున్న వైసీపీ కేంద్ర కార్యాలయానికి ఎటువంటి అనుమతులూ లేవన్నారు. ఆ భూమి జలవనరుల శాఖకు సంబంధించిందని, ఆ శాఖ అధికారుల అనుమతి తీసుకుని నిర్మించాలని హైకోర్టు స్పష్టంగా ఆదేశాలు జారీ చేసిందన్నారు. అనుమతి తీసుకోకుండా నిర్మించినందున తాడేపల్లి మునిసిపల్ శాఖ అధికారులు కోర్టు అనుమతితో భవనాన్ని కూల్చివేశారని పేర్కొన్నారు. ఇందులో కక్షసాధింపు లేదని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వంలో సుపరిపాలన జరుగుతుందని, అక్రమాలకు, అరాచకాలకు, కక్ష సాధింపులకు తావుండదని చెప్పారు.

## ఆటోను ఓవర్‌టేక్ చేయబోయి..

యువకుడి మృతి... మరొకరికి గాయాలు

చిత్తూరు, జూన్ 23: ముందు వెళుతున్న ఆటోను ఓవర్‌టేక్ చేయబోయి కిందపడి యువకుడు మృతి చెందాడు. మరో యువకుడు స్వల్పంగా గాయపడ్డాడు. ట్రాఫిక్ సీఐ నిత్యబాబు వివరాల మేరకు.. నగరంలోని కయనికట్టువీధికి చెందిన పవన్‌కుమార్(18), అతని స్నేహితుడు గోకుల కృష్ణ(23) బంగారుపాళ్యంకు ద్విచక్ర వాహనంలో వెళుతున్నారు. కాజూరుకు సమీపంలో ముందు వెళుతున్న ఆటోను ఓవర్‌టేక్ చేసే క్రమంలో కిందపడిపోయారు. పవన్‌కుమార్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గోకులకృష్ణకు స్వల్ప గాయాలు కావడంతో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తం

## గోనుమాకులపల్లెలో మైలారు పండుగ





మైలారు పండుగకు వచ్చిన ఎద్దులు, పశువులను నిలువరిస్తున్న యువకులు

వి.కోట, జూన్ 23: వి.కోట మండలం గోనుమాకులపల్లెలో ఆదివారం మైలారు పండుగ నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం పశువులకు పరుగు పందేలు నిర్వహించారు. ఈ పోటీలకు ఆంధ్రా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచీ రైతులు కోడెగిత్తలను తీసుకొచ్చారు. మూడు రౌండ్ల మేరకు కోడెగిత్తలకు పరుగులు పెట్టగా యువకులు వాటిని నిలువరించేందుకు ఉరకలు వేశారు. జనంతో గ్రామం కిక్కిరిసింది. పొలాల్లో పశువులు చేసిన విన్యాసాలు ఆసక్తిగా మారాయి. పోటీల్లో గెలుపొందిన కోడెగిత్తలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

## భక్తులతో కిటకిటలాడిన బోయకొండ





ప్రత్యేకాలంకారంలో బోయకొండ గంగమ్మ, క్యూలైన్లలో వేచియున్న భక్తులు

చౌడేపల్లె, జూన్23: బోయకొండ ఆదివారం గంగమ్మ భక్తులతో కిటకిటలాడింది. ఉదయం అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి, అమ్మవారికి ప్రీతికరమైన వేపాకు తోరణాలతో అలంకరించారు. అమ్మవారికి పూజలు, అభిషేకాలు నిర్వహించాక భక్తులకు దర్శనం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచీ అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రద్దీ కొనసాగింది

---

తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం సమీపాన వైసీపీకి చెందిన రాజభవనం వెలసింది. ఏడాదిన్నర కిందట అధికారాన్ని అడ్డుపెట్టుకుని అత్యంత ఖరీదైన ప్రభుత్వ భూమిని నామమాత్రపు లీజు ధరపై దక్కించుకున్న వైసీపీ పెద్దలు అందులో ఎలాంటి అనుమతులూ లేకుండా జిల్లా పార్టీ కార్యాలయం పేరిట భారీ భవంతిని నిర్మించారు. ఒకవైపు విమానాశ్రయం, మరోవైపు ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల నడుమ విలువైన భూమిని ఓ రాజకీయ పార్టీకి కేటాయించడమే ఆశ్చర్యకరమైతే దానికి స్థానిక పంచాయతీ నుంచి గానీ, తుడ నుంచి గానీ అనుమతులు లేకపోవడం మరింత ఆశ్చర్యం కలిగిస్తోంది. టీడీపీ అధికారంలోకి రావడంతో రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ కార్యాలయాలకు చేసిన భూ కేటాయింపులు, భవనాల నిర్మాణంపై కొత్త ప్రభుత్వం ఆరా తీస్తోంది. ఈ సందర్భంగా పలు ఆసక్తికరమైన విషయాలు వెల్లడవుతున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



రేణిగుంట మండలం కుర్రకాల్వ వద్ద నిర్మిస్తున్న వైసీపీ కార్యాలయ భవనం

# విమానాశ్రయ సమీపాన వైసీపీ రాజభవనం

## నామమాత్రపు లీజు ధరతో ఖరీదైన భూమి కేటాయించిన గత ప్రభుత్వం

## పరిశ్రమలకు ఇవ్వాల్సిన భూమి రాజకీయ పార్టీకి

## పంచాయతీ, తుడ అనుమతులు లేకుండానే నిర్మాణం

### ఎలక్ట్రానిక్స్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌లో ఖరీదైన భూమి కేటాయింపు

రేణిగుంట మండలం జీపాలెం పంచాయతీ కుర్రకాల్వ రెవెన్యూ గ్రామం 219-15, 219-16 సర్వే నెంబర్లలోని రెండెకరాల ప్రభుత్వ భూమిని 33 ఏళ్లపాటు వైసీపీ కార్యాలయం కోసం లీజుకు కేటాయిస్తూ 2022 డిసెంబరు 20న అప్పటి ప్రభుత్వం జీవో (నెంబరు 757) జారీ చేసింది. ఎకరాకు ఏడాదికి రూ.వెయ్యి చొప్పున లీజు చెల్లించే ప్రాతిపదికన భూమి కేటాయిస్తున్నట్టు అందులో పేర్కొన్నారు. ఈ భూమి విమానాశ్రయానికి చేరువగా ఆ మార్గంలోనే వుంది. గత టీడీపీ ప్రభుత్వం సరిగ్గా ఇక్కడే ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రత్యేకంగా శ్రీవెంకటేశ్వర ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌ను ఏర్పాటు చేసింది. ఈ క్లస్టర్ పరిధిలో ఇప్పటికే కార్బన్ మొబైల్స్, సెల్‌కాన్ మొబైల్స్ వంటి ఎలక్ట్రానిక్స్ వస్తువులు ఉత్పత్తి చేసే పరిశ్రమలు, ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజిటల్ టెక్నాలజీస్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కలినరీ వంటి జాతీయ స్థాయి విద్యా సంస్థలున్నాయి. ఇక్కడి ప్రభుత్వ భూములను ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలు లేదా ప్రతిష్టాత్మక విద్యాసంస్థలకు కేటాయించేందుకు ఉద్దేశించారు. బహిరంగ మార్కెట్‌లో ఎకరం విలువ రూ.5కోట్లకుపైగా పలుకుతోంది. ఇలాంటి చోట ఓ రాజకీయ పార్టీకి రూ.10 కోట్ల విలువైన రెండు ఎకరాల భూమిని ఎకరాకు ఏడాదికి కేవలం రూ.వెయ్యి నామమాత్రపు చెల్లింపుతో లీజుపై కేటాయించడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది.

### పంచాయతీ ఇచ్చింది నిరభ్యంతర పత్రమే!

వైసీపీ కార్యాలయం కోసం రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించడానికి ఎలాంటి అభ్యంతరం లేదని జీపాలెం పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపింది. భూమి కేటాయింపు ప్రక్రియలో భాగంగా అధికారాన్ని అడ్డుపెట్టుకుని పంచాయతీ పాలకవర్గంతో ఆ మేరకు తీర్మానం చేయించారు.

### అనుమతులు లేకుండానే నిర్మాణం

వైసీపీ కార్యాలయ భవన నిర్మాణానికి స్థానిక జీపాలెం పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులూ లేవు. నిర్మాణం ప్రారంభించిన సమయంలో పంచాయతీ సిబ్బంది వెళ్లి వాకబు చేయగా కలెక్టర్ అనుమతి, తుడ అనుమతులు వున్నాయని పనులు చేపట్టిన వ్యక్తులు చెప్పినట్టు సమాచారం. అసలే అధికార పార్టీ కార్యాలయం వ్యవహారం కావడంతో పంచాయతీ సిబ్బంది మిన్నకుండిపోయారని తెలిసింది. కాగా తుడాలో ఆరా తీయగా వైసీపీ కార్యాలయ భవన నిర్మాణానికి అనుమతి కోసం దరఖాస్తు చేయలేదని, తుడా అనుమతులు ఇవ్వలేదని వెల్లడైంది. భవన నిర్మాణం చేపట్టిన స్థలం పారిశ్రామికవాడ పరిధిలో వున్నందున ఏపీఐఐసీ అధికారుల నుంచి ఏమైనా అనుమతి తీసుకున్నారేమోనని ఆరా తీయగా అలాంటిదేమీ లేదని తెలిసింది.

---

## కోటపల్లిలో పంటలపై ఏనుగుల విధ్వంసం

● 21 కొబ్బరిచెట్ల నేలమట్టం





ఏనుగులు ధ్వంసం చేసిన కొబ్బరిచెట్లు, మామిడిచెట్లను చూపిస్తున్న రైతులు

కల్లూరు, జూన్ 23: పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు విధ్వంసం ఆగడంలేదు. మండలంలోని పాళెం పంచాయతీలో వారం రోజులుగా తిష్ట వేసిన ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఇప్పటివరకు ఊరికి దూరంగా ఉన్న పంటలను నాశనం చేస్తున్న ఏనుగులు శనివారం రాత్రి కోటపల్లికి ఆనుకొని ఉన్న పంటలపై పడ్డాయి. మామిడి, కొబ్బరి, పశుగ్రాసం తదితర పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. కల్లూరుకి చెందిన రైతు యుగంధర్ పొలంలోని 8 కొబ్బరిచెట్లను కూకటివేళ్లతో పెకలించాయి. 6 మామిడి చెట్లను విరిచేశాయి. రైతు పురుషోత్తానికి చెందిన 6 కొబ్బరిచెట్లను, 2 మామిడిచెట్లను, 12 రాతి కూసాలను విరిచేశాయి. అనంతరం కోటపల్లి గ్రామానికి ఆనుకొని ఉన్న బాబునాయుడు పొలంలోని 7 కొబ్బరిచెట్లను పెకలించాయి. మామిడిచెట్లను విరిచేశాయి. అర ఎకరా పశుగ్రాసాన్ని తొక్కేశాయి.

## ముగ్గురు స్మగ్లర్ల అరెస్టు

రెండు వాహనాలు సహా నాలుగు ఎర్రచందనం దుంగల స్వాధీనం



స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, జూన్ 23: అన్నమయ్య జిల్లా సానిపాయ పరిధిలో ఆదివారం టాస్క్‌ఫోర్సు పోలీసులు ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేసి, వారి నుంచి నాలుగు ఎర్రచందనం దుంగలతో పాటు కారు, మోటరుసైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఆర్ఎస్ఐ సురేష్‌బాబు బృందం శనివారం రాత్రి నుంచి అన్నమయ్య జిల్లా సానిపాయ పరిధిలో కూంబింగ్ చేపట్టారు. ముదుంపాడు అటవీ ప్రాంతంలో కొందరు వ్యక్తులు కారులో ఎర్రచందనం దుంగలను లోడ్ చేస్తూ టాస్క్‌ఫోర్సు పోలీసులకు కనిపించారు. దీంతో వారిని చుట్టుముట్టేలోగా పారిపోవడానికి యత్నించారు. అయితే వారిలో ముగ్గురిని పట్టుకోగలిగారు. పట్టుబడ్డ వారిలో తమిళనాడు తిరుపత్తూరు జిల్లాకు చెందిన విజయకుమార్(37), మోహనవేల్(25), శక్తివేల్(27)గా గుర్తించారు. వారిని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. "లించారు. కేసు నమోదు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## రుయాలో వసూల్ నాయక్

● ఏపనికైనా చేయి తడపాల్సిందే
● డీహెచ్‌కు సరెండర్ చేసిన డీఎంఈ



మెడికల్ సర్టిఫికెట్ మంజూరు చేసినందుకు బాధితుడి నుంచి నగదు తీసుకుంటున్న సీఎస్ ఆర్ఎంవో లక్ష్మానాయక్

తిరుపతి(వైద్యం), జూన్ 23: తిరుపతిలోని రుయా ఆస్పత్రి సీఎస్‌ఆర్ఎంవో లక్ష్మానాయక్ ఆగడాలతో విసిగిపోయిన యంత్రాంగం ఆధారాలతోసహా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. దీంతో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ (డీహెచ్)కు సరెండర్ చేస్తూ డీఎంఈ (డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్) వారం కిందట ఉత్తర్వులు జారీ చేశారు. కానీ అవేమీ పట్టించుకోకుండా తన చాంబర్‌లో వచ్చి కూర్చొని డ్యూటీ చేయడం మొదలుపెట్టడంతో ఆగ్రహించిన సూపరింటెండెంట్ మూడ్రోజుల కిందట ఆయన గదికి తాళాలు వేసేశారు. ఇదిలా ఉంటే మెడికల్ సర్టిఫికెట్ల కోసం వచ్చిన వారినుంచి సీఎస్ ఆర్ఎంవో వసూళ్లకు పాల్పడిన వీడియోలు తాజాగా వెలుగులోకి వస్తున్నాయి.

### ప్రతి పనికీ ఓ రేటు

రుయాస్పత్రిలో సీఎస్ ఆర్ఎంవోగా గతేడాది జనవరిలో బాధ్యతలు చేపట్టిన లక్ష్మానాయక్ ప్రతి పనికీ ఓ రేటు నిర్ణయించి జోరుగా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే విమర్శలు, ఫిర్యాదులున్నాయి. దీనికితోడు ఉద్యోగులతో దురుసుగా వ్యవహరించడం, మహిళా సిబ్బందిని వేధింపులకు గురిచేయడంతోపాటు రాత్రిళ్లు తనిఖీల పేరుతో మద్యం తాగి వైద్యులు, సిబ్బందిని దుర్భాషలాడతారట. ఈ విషయంపై ఇప్పటికే పీజీలు, హౌస్ సర్జన్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసి ఉన్నారు.

### వసూళ్లు ఇలా..

సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగులతోపాటు కొన్ని ప్రైవేటు సంస్థలకు చెందిన ఉద్యోగులకు మెడికల్ లీవ్ కావాలంటే ఆర్ఎంవో, సీఎస్ ఆర్ఎంవో స్థాయి అధికారులు సంబంధిత ధ్రువీకరణ సర్టిఫికెట్లు మంజూరు చేయాలి. ఈ మెడికల్ సర్టిఫికెట్ల కోసం రోజుకు దాదాపు 20 మందికిపైగా రుయాస్పత్రికి వస్తుంటారు. దీన్నే సీఎస్‌ఆర్ఎంవో స్థాయి అధికారి.. ఆదాయ వనరుగా మార్చుకున్నారట. బాధితుల అవసరాన్ని బట్టి మెడికల్ సర్టిఫికెట్ మంజూరుకు రూ.2వేల నుంచి రూ.5వేల వరకు వసూలు చేస్తారట. దీంతోపాటు ఆస్పత్రిలోని సిబ్బందికి కోరుకున్న చోట డ్యూటీ కావాలన్నా ఆయన అడిగినంత ఇవ్వాలట. వీటితోపాటు పారిశుధ్య, సెక్యూరిటీ, రోగులకు ఆహారం సరఫరా చేసే ఏజెన్సీల పనితీరును పరిశీలించి ప్రతి నెలా తగిన మార్కులు వేసి.. బిల్లులు మంజూరు చేయడానికీ రూ.లక్షలు వసూలు చేస్తారట.

### ప్రైవేటు వ్యక్తులతో వసూళ్ల పర్వం

మెడికల్ సర్టిఫికెట్లు, సిబ్బందిని భయపెట్టేందుకు ఇచ్చే మెమోలను తయారు చేసేందుకు, నగదు వసూళ్ల కోసం ఏకంగా ఇద్దరు ప్రైవేటు వ్యక్తులను తన చాంబర్‌లో నియమించుకున్నారట. దీంతో వీరిద్దరే అన్ని పనులు చూసుకోవడంతోపాటు సిబ్బందికి దిశానిర్దేశం కూడా చేస్తుండటంతో ఉన్నతాధికారులు సీఎస్ ఆర్ఎంవోను మందలించినా ఫలితం లేకపోయిందట.

### సరెండర్ చేసింది వాస్తవమే

సీఎస్ ఆర్ఎంవో లక్ష్మానాయక్‌పై ఇప్పటికే పలు ఫిర్యాదులు అందాయి. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోపాటు సిబ్బందితో దురుసుగా ప్రవర్తిస్తుండటం, ఏజెన్సీ నిర్వాహకులను వేధించడం, మెడికల్ సర్టిఫికెట్ల కోసం వచ్చేవారిని ఇబ్బంది పెట్టడం వంటి పలు ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి. వీటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఆయన్ను సరెండర్ చేయాలని ఆదేశించారు. దాంతో సరెండర్ చేయడంతోపాటు రిలీవ్ చేసిన మాట కూడా వాస్తవమే. కానీ ఆయన తన గదిలోనుంచి వెళ్లకుండా కూర్చొని ఉన్నారు. ఇదేమని అడిగితే దురుసుగా ప్రవరిస్తున్నారు. ఈ విషయాన్ని కూడా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి ఆదేశాల మేరకు గదికి తాళం వేశాం.

- రవిప్రభు, సూపరింటెండెంట్, రుయాస్పత్రి

---

## పంచాయతీ నిధుల దారి మళ్లింపుపై విచారించండి



ధనుంజయయాదవ్

విజయపురం, జూన్ 23: గ్రామ పంచాయతీ నిధుల దారి మళ్లింపుపై విచారించి, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా పంచాయతీ రాజ్ చాంబర్ అధ్యక్షుడు చుక్కా ధనుంజయయాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం విజయపురంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖా మంత్రిగా పవన్‌కల్యాణ్ బాధ్యతలు తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. నాలుగు సంవత్సరాల నుంచి రాష్ట్రంలోని 12,918 పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం 14, 15 ఆర్థిక సంఘాల ద్వారా, ఉపాధి హామీ పథకం ద్వారా రూ.8,629కోట్లను కేటాయిస్తే గత ప్రభుత్వం దారి మళ్లించి దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. దీనిపై పలు ఉద్యమాలు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. నిధుల దుర్వినియోగానికి బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.